

గణపయ్యకు
వరద కష్టాలు

- మున్నేటి బీభత్సంతో విగ్రహాల తయారీకి మట్టి కొరత
- కేఎంసీలో ఉచిత పంపిణీకి నోచుకోని 2 వేల ప్రతిమలు

6

మున్నేరు మూల్యం రూ.89 కోట్లు

- ధ్వంసమైన రోడ్లు, డ్రెయినేజీలు, పైప్‌లైన్లు, కల్వర్టులు
- అంచనాలు రూపొందించిన కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక సిద్ధం



ఇంజనీరింగ్ అధికారులతో రివ్యూ చేస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 9: మున్నేరు వరద పోటు, భారీ వర్షాలు ప్రజల ఆస్తులతోపాటు ఖమ్మం నగర పాలక సంస్థ ఆస్తులను కూడా ధ్వంసం చేశాయి. చరిత్రలో ఏనాడూ జరగని ఆస్తి నష్టం వాటిల్లింది. నష్టం అంచనాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించేందుకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పర్యవేక్షణలో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య రూపొందించారు. ఈ మేరకు సోమవారం కేఎంసీ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో రివ్యూ నిర్వహించి నివేదికలను సిద్ధం చేశారు.

ఆగస్టు 26 నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో 26 సెం.మీ. వర్ష పాతం నమోదైంది. దీంతోపాటు మున్నేరుకు వరద పోటు రావటంతో పరీవాహక ప్రాంతంలోని రహదారులు, తాగునీటి పథకాలు ధ్వంసమయ్యాయి. 39 కాలనీలు వరద ప్రభావానికి గురయ్యాయి. 71 కి.మీ. మేర సీసీ రహదారులు ధ్వంసం కావటంతో రూ.26 కోట్ల నష్టం వాటిల్లింది. 18 కి.మీ. బీటీ రహదారులు ధ్వంసం కావటంతో రూ.2.95 కోట్లు, 124 కి.మీ. మేర మెటల్ రహదారులు గుంతలు పడటంతో రూ.10 కోట్లు, 218 కి.మీ. గ్రావెల్ రహదారులకు రూ.10.3 కోట్లు, 80 కి.మీ. డ్రైనేజీలకు రూ.22 కోట్లు, 85 కల్వర్టులకు రూ.కోటి, 3,480 వీధి దీపాలకు రూ.1.38 కోట్లు, 2.5 కి.మీ. పైపులైన్‌కు రూ.5 లక్షలు, ఫిల్టర్ బెడ్‌లు, ఇన్‌టేక్ వాల్స్ ధ్వంసం కావటంతో రూ.15 కోట్లు మొత్తం రూ.89 కోట్ల నష్టం వాటిల్లింది. దీంతో అన్ని విభాగాల నుంచి ఫొటోలు, సమాచారం తెప్పించి నివేదికలను సిద్ధం చేశారు.



దెబ్బతిన్న రోడ్డు

వరద బాధితులకు గుర్తింపు కార్డులు

- భవిష్యత్‌లో సంక్షేమ కార్యక్రమాల్లో ప్రాధాన్యం
- నేటినుంచి బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ
- జిల్లావ్యాప్తంగా వరద నష్టం రూ.339.45కోట్లు
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



ఖమ్మం సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో వరద బాధిత కుటుంబాలకు మంగళవారం నుంచి బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సహాయం జమ అవుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. అలాగే బాధిత కుటుంబాలకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు పరిశీలిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆ కుటుంబాలు కోలుకునేందుకు ఆయా సంక్షేమ శాఖల ద్వారా ఉపాధి కార్యక్రమాలు అందించేందుకు ప్రాధాన్యం కల్పించాలన్నది ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో వరదల కారణంగా రూ.339.45 కోట్ల మేర నష్టం సంభవించినట్టు ఇప్పటివరకు ప్రాథమిక అంచనాల్లో తేలిందని, వరదల కారణంగా సుమారు 15,055 ఇళ్లకు వరద చేరిందని 146 ఇళ్లు పూర్తిగా పడిపోయాయని వేలాది కుటుంబాలు నిరాశ్రయమైనందున వీరికి ప్రభుత్వం ఇచ్చే తాత్కాలిక సహాయంతోపాటు ఆయా సంక్షేమ శాఖల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ ప్రక్రియలో బాధిత కుటుంబాలకు గుర్తింపు కార్డు ఇచ్చి వారు కోలుకునేందుకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందించబోతున్నామని చెప్పారు. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌తోపాటు జిల్లాలో ఇతర నియోజకవర్గాల్లో వరద బాధిత కుటుంబాలకు ఈ కార్డులు ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వారికి ప్రాధాన్యత కల్పిస్తామని కలెక్టర్ వివరించారు. వరద బాధిత కుటుంబాలకు మంగళవారం నుంచి తక్షణసాయం కింద రూ.10వేలు బ్యాంకుల్లో జమచేయడం జరుగుతుందన్నారు.

ఖమ్మం జిల్లావ్యాప్తంగా వరదల కారణంగా రూ.339.45కోట్ల మేర నష్టం జరిగిందని, ఇందులో వ్యవసాయశాఖకు అత్యధికంగా రూ.111.87 కోట్ల నష్టం జరిగిందని తెలిపారు. అలాగే మున్నేరు వరద, అకాలవర్షాలతో ముంపునకు గురికాకుండా ఒక కార్యాచరణ రూపొందిస్తున్నామని, గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాల్లో వరదలు, వర్షాల పరిస్థితిని నిరంతరం అధ్యయనం చేసేందుకు ఖమ్మం కేంద్రంగా తగిన కార్యాచరణ రూపొందించబోతున్నామని తెలిపారు. గోదావరి వలె మున్నేరు వరదల సహాయ కార్యక్రమాలపై ఒక శాశ్వత మాన్యువల్ రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.

జిల్లాలో వరదల కారణంగా విద్యార్థులతోపాటు రైతులు అనేకమంది జిల్లా వాసులు ధ్రువీకరణ పత్రాలు పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇంటి దస్తావేజులు కోల్పోయారని, 1077 కాల్‌సెంటర్ ఏర్పాటుచేసి ఫిర్యాదులు స్వీకరించి రెండువారాల్లోగా వారికి సంబంధిత యూనివర్సిటీలు, విద్యాసంస్థలు, ఎస్సెస్సీ, ఇంటర్ బోర్డుల ద్వారా మెమోలు, టీసీలు, స్టడీ సర్టిఫికెట్లు, మండలం నుంచి నివాస, ఆదాయ పత్రాలు, దస్తావేజులు, పట్టాదారు పాస్ పుస్తకాలను అధికార యంత్రాంగమే బాధితులకు లామినేషన్ ద్వారా అందించే కార్యక్రమం చేపట్టామని, ఇప్పటికే 600 ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ వివరించారు.

అలాగే ఖమ్మం నగరంలో చెరువులతోపాటు కాలువల ఆక్రమణపై అందరితో చర్చించి తొలగించే కార్యక్రమం చేపడతామన్నారు. ప్రస్తుతం వరద బాధితులకు పునరావాసం, వారికి సహాయ కార్యక్రమాలపై తమ దృష్టి ఉందని, ఆ తర్వాత రైతులకు అవసరమైన సహాయ కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు.

వరద బాధితులకు అండ

- తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.10 లక్షల సాయం
- తానా మాజీ అధ్యక్షుడు జయశేఖర్



ఖమ్మం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మంలో మున్నేరు వరదల కారణంగా నష్టపోయిన బాధితుల కుటుంబాలకు తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ టస్టు తరపున రూ.10లక్షల సహాయం అందిస్తున్నట్లు తానా మాజీ అధ్యక్షుడు ఎన్‌ఆర్‌ఐ తాళ్లూరి జయశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. మున్నేరు వరదల కారణంగా నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటనకు స్పందించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామానికి చెందిన తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు తరపున రూ.10 లక్షలు అందిస్తున్నామని ట్రస్టు నిర్వహకుడు, ఎన్‌ఆర్‌ఐ జయశేఖర్ తాళ్లూరి, రాజశేఖర్ తాళ్లూరి ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిధులను వరద ప్రాంతాల్లోని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు, వాటర్‌బాటిళ్లు, పెన్నులతో పాటు దెబ్బతిన్న ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన ఫర్నిచర్ అందించడానికి వినియోగిస్తామని, అవసరమైతే తమ ట్రస్టు తరపున మరికొంత సహకారం అందిస్తామని, జిల్లా ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సహకారంతో అందించడం జరుగుతుందని జయశేఖర్ జయశేఖర్ తెలిపారు.

కేఎంసీకి చేరిన హైసా కిట్లు

- 10 వేల మందికి అందించడం లక్ష్యం
- పంపిణీ ప్రారంభించిన అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ



ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 9: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో మున్నేరు వరద బాధితులతోపాటుగా భారీ వర్షాలతో ఇళ్లు దెబ్బతిని ఆర్థికంగా కోల్పోయిన బాధితులకు అండగా ఉండేందుకు హైదరాబాద్‌లోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హైసా (హెచ్‌వైఎస్‌ఈఏ) ఖమ్మం వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. రూ.3కోట్ల వ్యయంతో 10వేల నిత్యవసరాల, వస్తువులు కిట్లను సోమవారం ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయానికి ప్రత్యేక వాహనంలో అందించారు. కేఎంసీ కార్యాలయానికి చేరుకున్న కిట్లను అసిస్టెంట్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ బాధితులకు అందించి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళవారం నుంచి డివిజన్లు, ప్రాంతాల వారీగా బాధితులకు అందనున్నాయి. కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి క్యాంపు కార్యాలయం అధికారి బోడేపూటి రంజిత్ పర్యవేక్షణ చేశారు.

వరద గుమ్మం



ఈ నగరానికి ఏమైంది?

చిన్నపాటి వర్షాలకే జలమయం అవుతున్న ఖమ్మం కాలనీలు

- దర్జాగా అనుమతులిచ్చి కూల్చివేతకు దిక్కులు చూస్తున్నారు...
- గతంలో పర్మిషన్లు ఇచ్చి గాలికి వదిలేసిన అధికారులు
- అవి పరిశీలిస్తే తప్ప తొలగించలేమంటున్న వైనం
- కుంచించుకుపోయిన గొలుసుకట్టు చెరువుల కాల్వ
- కెనాల్ మ్యాపే లేదంటున్న మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు
- వరదకు దారిలేక మునకకు గురవుతున్న కాలనీలు

ఖమ్మం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'కాదేది కబ్జాకు అనర్హం' అన్నట్టుగా ఖమ్మం నగరంలో అక్రమ నిర్మాణాలు సాగించారు అక్రమార్కులు. ప్రభుత్వ స్థలం, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్, ఎన్నెస్పీ.. ఇలా ఎక్కడ స్థలం కనిపిస్తే అక్కడ పాగా వేశారు. పక్కనే ఉన్న స్థలం పేరుతో అనుమతులు తీసుకోవడం, ఆ పేరుతో ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేయడం గడిచిన పదేళ్లకాలంలో పెద్దఎత్తున సాగాయన్న ఆరోపణలున్నాయి. అనుమతులు ఒకచోట తీసుకుని మరో ప్రాంతంలో నిర్మాణాలు చేస్తున్నప్పటికీ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు అవినీతి మైకంలో కన్నెత్తి చూడలేదన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా మున్నేటి వరదకు ఏ మాత్రం సంబంధంలేని మెరక ప్రాంతాల్లో గల పదుల కాలనీలు చిన్నపాటి వర్షానికే వరద తాకిడికి గురవ్వాల్సిన దుస్థితి ఏర్పడింది.

కాలనీల్లోకి వరద నీరు..

ఇటీవల కురిసిన వర్షాలతో ఖమ్మం నగరం అతలాకుతలమైన పరిస్థితులు నెలకొన్నాయి. వాస్తవానికి మున్నేరుకు వరద పెరిగిన సమయంలో నదీ ప్రవాహానికి సమీపంలో ఉన్న ప్రాంతాలు మాత్రమే ప్రభావితమయ్యేవి. గతేడాది వర్షాలు కురిసిన సమయంలో ఖమ్మం నగరంలోని మరికొన్ని ప్రాంతాలకు వరద నీరు చేరుకుని ఇళ్లల్లో నీళ్లు నిలిచిపోయాయి. కాగా గడిచిన వారం రోజులనుంచి కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు ఖమ్మం నగరం మొత్తం వరదనీటితో నిండిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ప్రతియేటా మహబూబాబాద్, బయ్యారం ప్రాంతాల్లో వర్షాలు అధికంగా పడిన సమయంలో మున్నేరు నది ఉప్పొంగి ప్రవహించేది. అలా ప్రవహించిన సమయంలో తీరానికి చేరువలో ఉన్న దానవాయిగూడెం, రామన్నపేట, మోతీనగర్, వెంకటేశ్వరనగర్, రంగనాయకుల గుట్ట, ప్రకాష్‌నగర్, బొక్కలగడ్డ, పద్మావతినగర్ ప్రాంతాలు పూర్తిగా నీటమునిగిపోయాయి. అయితే ఈ యేదాది మాత్రం మున్నేరుకు సమీపంలో లేని పాండురంగాపురం, అమరావతినగర్, ఖానాపురం, టేకులపల్లి, చైతన్యనగర్, కవిరాజ్‌నగర్, రోటరీనగర్, మమతారోడ్డు, ప్రశాంతినగర్, మధురానగర్ వంటి ప్రాంతాల్లో కూడా నడుముల్లోతు వరదనీళ్లు నిలిచాయి. వీటితోపాటుగా మామిళ్లగూడెం, రాపర్తినగర్ వంటి ప్రాంతాల్లో కూడా నీరు నిలవడం కొసమెరుపు.

గతంలో ఎన్నిసార్లు మున్నేరుకు వరదలు వచ్చినప్పటికీ ఆయా ప్రాంతాల్లో అంతటిస్థాయిలో వరద నీరు నిలిచిపోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. దానంతటకీ కారణం నగరంలో ఉన్న ఎగువ ప్రాంతాలనుంచి ఎగబాకిన వరదనీరు వెళ్లేదారి లేకపోవడంతో దిగువన ఉన్న ప్రాంతాలన్నీ ముంపునకు గురయ్యాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మం నియోజకవర్గంలో భాగంగా నగరానికి సమీపంలో ఉన్న రఘునాథపాలెంలో ఎక్కువస్థాయిలో వర్షం పడితే ఆ నీరు గొలుసుకట్టు చెరువులకు సంబంధించిన కాల్వల ద్వారా ఖానాపురం చెరువు, టేకులపల్లి చెరువు, లకారం చెరువు, ధంసలాపురం చెరువు ద్వారా వెళ్లి మున్నేరులో కలవాల్సి ఉంటుంది. ఆయా చెరువులకు సమీపంలోని బల్లేపల్లి, పాండురంగాపురం, అమరావతినగర్, విద్యానగర్, ఖానాపురం, ప్రస్తుతం ముంపునకు గురైన కాలనీల వరద సైతం ఓ పెద్ద కాల్వద్వారానే ధంసలాపురానికి చేరి అక్కడ నుంచి మున్నేరులో కలవాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఆ కాల్వను ఆక్రమించి దర్జాగా భవంతులు నిర్మించి కాల్వను మూసివేసిన కారణంగా ఎక్కడి నీరు అక్కడే నిలిచి ఇళ్లకు ఎగబాకినట్టు తెలుస్తోంది.

కూల్చివేతకు అనుమతుల అడ్డంకి

గడిచిన పదేళ్ల కాలంలో గొలుసుకట్టు చెరువులకు సంబంధించిన సుమారు 100అడుగులు ఉన్న కాల్వ ఆక్రమణల పాలైనట్టుగా తెలుస్తోంది. సదరు కాల్వకు పక్కన ఉన్న పట్టా భూములకు అనుమతులు ఇచ్చి ఆయా నిర్మాణాలు జరుగుతున్న (మిగతా 6వ పేజీలో)



ఖమ్మం చైతన్యనగర్‌లో కుంచించుకుపోయిన కాల్వ

కాలువపై నిర్మించిన ఐస్ ఫ్యాక్టరీ కూల్చివేత 6

భద్రాద్రి జిల్లాలో భారీ వర్షం

- పలు మండలాల్లో పొంగిన వాగులు
- తాలిపేరు, కిన్నెరసాని ప్రాజెక్టులకు పోటెత్తిన వరద
- లక్షటన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

కొత్తగూడెం, సెప్టెంబరు 9: భద్రాద్రి జిల్లాలో భారీ వర్షం కురవడంతో పలు మండలాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఆదివారం అర్థరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఎడతెరిపి లేని వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి పెరిగింది. ఉదయం 24అడుగుల నుంచి రాత్రి 11 గంటలకు 33.4 అడుగులకు చేరింది. అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట మండల పరిధిలోని పెద్ద గొల్లగూడెం గ్రామంలో చింతలచెరువులో ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి పడి మృతిచెందాడు. జూలూరుపాడు మండలంలో కురిసిన భారీ వర్షానికి గుండెపుడి గ్రామంలోని చెరువుకట్ట కోతకు గురైంది. కట్టకు రంధ్రాలు పడి నీరు వృథాగా బయటకుపోవటంతో అధికార యంత్రాంగం వెంటనే అప్రమత్తమై కట్ట తెగిపోకుండా మరమ్మతులు చేపట్టారు. సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువుకు భారీగా వరద చేరడంతో పూర్తిస్థాయిలో అలుగు ప్రవహించింది. ఈ చెరువు కూడా ప్రమాదపుటంచులో ఉంది. కట్ట మధ్యలో కొద్దిభాగం కుంగిపోవటంతో అధికారులు వెంటనే అప్రమత్తమై మరమ్మతులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

గోధుమవాగు పొంగి ప్రవహించడంతో పెనుబల్లి వద్ద వంతెనపైకి నీరు రావటంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. ఛత్తీస్‌గఢ్, ఒడిసా ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద ఉధృతి అధికం కావడంతో 25 గేట్లు ఎత్తి లక్ష క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న గోదావరిలోకి వదిలారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరగడంతో రెండు గేట్లు ఎత్తి 11వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో గత రెండు రోజుల నుంచి సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లోకి నీరు చేరడంతో సుమారు లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పత్తి పూత రాలడంతోపాటు కాయలు కుళ్లిపోతుండటంతో దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.



భద్రాచలం వద్ద గోదావరి పరవళ్లు

గోదావరి పరవళ్లు

- భద్రాచలం వద్ద 33.4 అడుగులు
- నేడు మొదటి ప్రమాద హెచ్చరికకు చేరే అవకాశం

భద్రాచలం, సెప్టెంబరు 9: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సోమవారం ఉదయం వరకు తగ్గి అనంతరం పెరుగుతోంది. సోమవారం ఉదయం 6 గంటలకు 25.3 అడుగులున్న గోదావరి నీటిమట్టం 9 గంటలకు 25.6, 12 గంటలకు 26.1, 3 గంటలకు 27.6 అడుగులు, రాత్రి 11 గంటలకు 33.4 అడుగులకు చేరింది.

చర్ల మండలం తాలిపేరు నుంచి 24 గేట్లు ఎత్తి 1.30లక్షల క్యూసెక్కుల నీరు దిగువన ఉన్న గోదావరిలోకి విడుదల చేశారు. రానున్న 24 గంటల్లో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మరింతగా పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. గోదావరి ఎగువ భాగాన కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం భారీగానే పెరిగే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మంగళవారం తొలి ప్రమాద హెచ్చరిక 43అడుగులకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. దీంతో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమవుతోంది. నదీ పరివాహక ప్రాంతంలోని ముంపు ప్రాంతాలకు చెందిన వారిని సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేలా అవగాహన కల్పించడంతోపాటు ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టేందుకు అధికారులు ముందస్తుగానే సన్నద్ధమవుతున్నారు. ఇదిలా ఉండగా గత 24 గంటల్లో భద్రాచలం ఏజెన్సీలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండటంతో జనజీవనానికి తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

ప్రశ్నించే తత్వానికి ప్రతీక కాళోజీ

ఐటీడీఏ పీవో రాహుల్.. ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

భద్రాచలం, సెప్టెంబరు 9: భద్రాచలంలోని ఐటీడీఏ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముందుగా ఐటీడీఏ పీవో బి.రాహుల్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ తెలంగాణ భాషా అభివృద్ధికి కాళోజీ చేసిన సేవలు శ్లాఘనీయమన్నారు. ఆయన తన రచనలతో యావత్ తెలంగాణ సమాజంలో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించారన్నారు. తెలుగు భాష ముఖ్యంగా తెలంగాణ భాషాభివృద్ధికి ఆయన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ భాష సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ తదితర పోటీలను నిర్వహించి ప్రోత్సాహక బహుమతులను పీవో బి.రాహుల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, గురుకుల ఆర్‌సీవో నాగార్జునరావు పాల్గొన్నారు.



కాళోజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్



తీరని కష్టం.. అనుమతుల్లో జాప్యం

దశాబ్దాల కాలంగా భద్రాద్రి ఏజెన్సీలోని మారుమూల అంతర్గత గ్రామాలకు కనీస రహదారి సౌకర్యం కూడా లేని దుస్థితి. ఈ క్రమంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో రహదారి సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిజం పథకం కింద(ఎల్‌డబ్ల్యుఈ పథకం) రహదారుల నిర్మాణం కోసం నిధులు కేటాయించి మంజూరు చేసినా అవి నేటికి ప్రారంభం కాలేదు. టెండర్ల ప్రక్రియ పూర్తయి కేంద్ర అటవీశాఖ అనుమతుల కోసం ఆరేళ్లుగా కాంట్రాక్టర్లు ఎదురు చూస్తున్నారు. కేంద్ర నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంటుతో గతంలో చేపట్టాల్సిన రూ.30 కోట్లకు పైగా రహదారి పనులకు సైతం నేటికీ మోక్షం లేదు.

- ఏజెన్సీలో సంవత్సరాలుగా ఆగిన రహదారులు
- ఆరేళ్లుగా కాంట్రాక్టర్ల నిరీక్షణ
- నిలిచిన రూ.100 కోట్ల రహదారుల పనులు
- రోడ్లు లేక గర్భిణుల అవస్థలు వర్ణనాతీతం

భద్రాచలం,సెప్టెంబరు 9: భద్రాచలం ఏజెన్సీలో 2018లో పదికి పైగా రహదారులు, వారధుల నిర్మాణం రూ.100 కోట్లతో చేపట్టాల్సి ఉంది. ఎల్‌డబ్ల్యూఈ పథకం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఈ రహదారులు మంజూరు కాగా నిధులు విడుదల కావడం, టెండర్లను ఆహ్వానించడం ఆరేళ్ల క్రితమే పూర్తయ్యింది. కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు కేంద్ర అటవీశాఖ అనుమతులు కీలకం కావడంతో వాటి కోసం వారు ఎదురుచూస్తున్నారు.

హైలెవల్ వంతెనలు కీలకం..

చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని ఎదిర నుంచి కొత్తపల్లికి, పెద్దమిడిసీలేరు నుంచి బత్తినపల్లికి, కుర్నపల్లి నుంచి బత్తినపల్లి, కుర్రపల్లి నుంచి ఎర్రబోరు, ముల్కనాపల్లి నుంచి అర్లపెంట, పెద్దమిడిసీలేరు నుంచి రాళ్లాపురం, తిప్పాపురం నుంచి చెలిమెల, బత్తినపల్లి నుంచి చెన్నాపురం, ఆర్.కొత్తగూడెం నుంచి బత్తినపల్లి, బోదనెల్లి నుంచి డోక్‌పాడు, కుర్రపల్లి నుంచి ఎర్రబోరు, పెద్దమిడిసీలేరు నుంచి చెన్నాపురం గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇటీవల వరకు జెట్టికట్టి గర్భిణులను ప్రసవం కోసం వైద్యశాలలకు మోసుకొస్తున్న బాధకర దృశ్యాలు ఈ ప్రాంతాల్లో తరచూ దర్శనమిస్తూనే ఉండటం అత్యంత బాధాకరమైన విషయమని ఏజెన్సీవాసులు వాపోతున్నారు. పెద్దమిడిసీలేరు నుంచి బత్తినపల్లి రోడ్డులో రెండు హైలెవల్ బ్రిడ్జిలు నిర్మాణం పూర్తయితేనే ఆ గ్రామాలకు రహదారి సౌకర్యం నిర్మించేందుకు వెసులుబాటు లభిస్తుంది.



అటవీ ప్రాంతాల్లో వాగు ప్రదేశాల్లో రహదారుల పరిస్థితి ఇలా

ప్రభుత్వాల సమన్వయ లోపమే కారణం?

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం కారణంగానే రహదారుల నిర్మాణానికి మోక్షం లభించడం లేదనే విమర్శలున్నాయి. ఎల్‌డబ్ల్యూఈ కింద కేంద్రం మంజూరు చేసిన పనులకు కేంద్ర అటవీశాఖ అనుమతులు సైతం కీలకమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మరి కేంద్రమే మంజూరు చేసిన పనులకు కేంద్ర అటవీశాఖ అనుమతులకు మోకాలడ్డటం ఎంత వరకు సమంజసమని ఏజెన్సీవాసులు ప్రశ్నిస్తున్నారు. గతంలో నిర్మించిన పలు రహదారులకు అటవీశాఖకు గత ప్రభుత్వం చెల్లించాల్సిన డబ్బులను కూడా చెల్లించకపోవడంతో ఆర్‌అండ్‌బీ అధికారుల నుంచి అటవీశాఖ నుంచి నోటీసులు వచ్చినట్లు సమాచారం. ఒక వైపు కేంద్ర హోంశాఖ మంత్రి ఎల్‌డబ్ల్యూఈ పనులను వేగవంతం చేయాలని చెబుతుండగా మరో వైపు 2018లో కేంద్రం మంజూరు చేసిన పనులకే నేటికి మోక్షం లేకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

గణపయ్యకు వరద కష్టాలు

- మున్నేటి వరదతో విగ్రహాల తయారీకి మట్టి కొరత
- కేఎంసీలో ఉచిత పంపిణీకి నోచుకోని రెండు వేల ప్రతిమలు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 9: మున్నేరు వరదలతో ఖమ్మం నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోగా ఆ ప్రభావం గణపతి నవరాత్రి ఉత్సవాలపైనా పడింది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు యేటా వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను ప్రోత్సహించేందుకు ఉచితంగా మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తుంటారు. అయితే ఈ సారి మున్నేరు వరదలతో మున్నేరు వరదలతో బొక్కలగడ్డ, కాల్వొడ్డు ప్రాంతాల్లో నల్లమట్టి లభించకపోవడంతో మట్టి విగ్రహాల తయారీకి మట్టి కొరత ఏర్పడింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో ఒక్కో మట్టి విగ్రహాన్ని భక్తులు రూ.150కు కొనుగోలు చేశారు.

ఇదిలా ఉంటే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రతీ సంవత్సరం వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఖమ్మం నగర పాలకసంస్థ మట్టి విగ్రహాలను కొనుగోలు చేసి వాటిని ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తుంది. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా కేఎంసీ పరిధిలోని 60 డివిజన్లకు ఏడు వేల విగ్రహాలు పంపిణీ చేసేందుకు శుక్రవారం కేఎంసీకి ఎన్విరాన్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో తెప్పించారు. శనివారం వినాయక చవితి సందర్భంగా ఈ ఏడువేల మట్టి విగ్రహాలను పంపిణీ చేయాల్సి ఉంది. కానీ ఆ పంపిణీ కార్యక్రమం పూర్తి చేయలేకపోయారు.



ఖమ్మం కార్పొరేషన్‌లో ఉచిత పంపిణీకి నోచుకోని ప్రతిమలు

ఎన్విరాన్‌మెంట్ విభాగం అధికారుల నిర్లక్ష్యంతో విగ్రహాల పంపిణీ పూర్తి చేయలేకపోయారని, అందువల్లనే రెండు వేల మట్టి విగ్రహాలు కేఎంసీ కార్యాలయంలోనే మిగిలిపోయాయని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో పలువురు ఉద్యోగులు తమ విభాగాల్లో పూల కుండీలకు నల్లమట్టి కోసం మట్టి గణపయ్యను ముక్కలుగా చేసి పడేశారు. ఈ విషయంపై ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇందులో తన తప్పేమీ లేదని, మేప్మా పరిధిలోని ఆర్పీలు మట్టి గణపయ్యలను పంపిణీ చేయలేదని తెలిపారు. కేఎంసీకి ఎవ్వరైనా వచ్చి మట్టి గణపయ్యలను తీసుకెళ్లవచ్చని సూచించారు.

కోతకు గురైన మేడికుంట చెరువు కట్ట

- యుద్ధ ప్రాతిపాదికన అధికారులు చర్యలు

జూలూరుపాడు, సెప్టెంబరు 9: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని మేడికుంట చెరువుకు వరద పోటెత్తి నిండి పోయింది. వరద తాకిడికి చెరువు కట్ట బలహీనపడి సోమవారం కోతకు గురైంది. కట్టకు రంధ్రాలు పడి నీరు వృథాగా పోతుండడాన్ని గుండెపుడి గ్రామస్థులు గుర్తించారు. చెరువు కట్ట కోతకు గురై తెగిపోయే ప్రమాదం ఉందని గమనించి సమాచారాన్ని అధికారులకు తెలియజేశారు. దీంతో హుటాహుటిన చెరువు వద్దకు తహసీల్దార్ స్వాతిబిందు, ఐబీడీఈ కిషోర్, ఏఈ వెన్నెల, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఎస్సై రాణాప్రతాప్, ఎంపీవో తులసీరాం, ఆర్ఐ తిరపతిరావులు చేరుకుని కోతకు గురైన కట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. ఏ క్షణంలోనైన కట్ట తెగే ప్రమాదం ఉండటంతో పరిస్థితిని అంటనా వేశారు. దీంతో కట్ట తెగిపోకుండా ఉండేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. గ్రామస్థుల సహకారంతో కోతకు గురైన ప్రాంతంతో ఇసుక బస్తాలు, వరిగడ్డి వేసి నీరు బయటకు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. కోతకు గురైన ప్రాంతంలో కట్ట మరింత కుంగి పోయింది. దీంతో అధికారులు ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టి ఇసుకను తెప్పించి ఎక్స్‌కవేటర్‌తో తాత్కలికంగా చెరువు కట్టకు మరమ్మతులను చేపట్టారు. దీంతో పెద్ద ముప్పు తప్పింది. కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్‌రెహమాన్ మేడికుంట చెరువును సందర్శించి తహసీల్దార్ నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు.



కట్టకు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

తాలిపేరుకు వరద పోటు

- 25గేట్లు ఎత్తివేత
- లక్షా 60వేల క్యూసెక్కుల నీరు విడుదల

చర్ల, సెప్టెంబరు 9: ఛత్తీస్‌గఢ్‌తో పాటు, చర్ల మండలంలో గత రెండు రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తుతోంది. సోమవారం ప్రాజెక్టు 25 గేట్లను ఎత్తిన అధికారులు లక్షా 60వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, సుకుమా జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. పామేడులోని చింత వాగు, చర్ల మండలంలోని రోటింత వాగు, జెర్రిపోతుల, తరివాగు, ఈతవాగులు వాగులు పొంగి పొర్లు తున్నాయి. దీంతో తాలిపేరు ప్రాజెక్టులోకి గంట గంటకూ వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట వద్ద పరిస్థితిని అంచానా వేస్తున్న డీఈ తిరుపతి, ఏఈ శ్రీనివాసరావు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రాజెక్టు వద్ద ప్రస్తుత నీటి మట్టం 72.35 మీటర్లు కాగా, ఇన్‌ఫ్లో లక్ష 30వేల క్యూసెక్కులుగా ఉంది.

పొంగుతున్న గోధుమ వాగు

చుంచుపల్లి, సెప్టెంబరు 9: భారీ వర్షాలకు పెనుబల్లి పంచాయతీ వద్ద గల పెనుబల్లి బ్రిడ్జీ పైనుంచి గోధుమ వాగు ఆదివారం ఉధృతంగా ప్రవహించింది. సమాచారం తెలుసుకున్న చుంచుపల్లి ఎంపీడీవో వంతెన వద్దకు చేరుకొని రాకపోకలను నిలిపివేశారు. ముళ్ల కంచెలను వేసి రక్షణ చర్యలు చేపట్టారు. గోదుమ వాగు వరద ఉధృతి తగ్గడంతో పెనుబల్లి వాసులకు ప్రమాదం తప్పింది. వర్షాలకు విద్యానగర్ పంచాయతీలోని చింతలచెరువు జలకళ సంతరించుకుంది. చెరువు అలుగు నుంచి వరద నీరు ప్రవహిస్తూ కొత్తగూడెం-ఖమ్మం ప్రధాన రహదారిపైకి చేరింది.

మున్నేరు నిర్వాసితులకు త్వరలో ఇళ్లు

- ప్రతి పక్షాలు వరదలపై బురద రాజకీయం మానుకోవాలి
- మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న మైనంపల్లి

ఖమ్మం రూరల్, సెప్టెంబరు 9: రాష్ట్ర ప్రభుత్వం మున్నేరు వరద బాధితులంతదరికీ త్వరలోనే ఇళ్లు అందజేస్తుందని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. ఖమ్మం జిల్లా, ఖమ్మం రూరల్ మండలం, జలగంనగర్‌లో వరద ముంపు బాధితులకు మంత్రి పొంగులేటి చొరవతో మైనంపల్లి హైదరాబాద్ నుంచి స్వయంగా రెండు డీసీఎం వాహనాలలో ఒక్కో కిట్టు రూ.2 వేల విలువ చేసే నిత్యవసర సరుకులను 500 మందికి సోమవారం మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ దయాకర్ రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వరదలపై ప్రతిపక్షాలు బురద రాజకీయాలు మానుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ప్రవేశపెట్టిందే కబ్జాదారుల ఆటకట్టించడానికే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాదబాబు, మాజీ సర్పంచ్‌లు బండి జగదీష్, మద్ది వీరారెడ్డి, అశోక్, సురేష్ నాయక్, కిషోర్ నాయక్, సుబ్బారావు, తమ్మినేని నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మించిన ఐస్‌ఫ్యాక్టరీ కూల్చివేత

ఖమ్మంక్రైం, సెప్టెంబరు9: నగరంలోని కవిరాజ్‌నగర్ సమీపంలోని లకారం చెరువుకు నీరు వెళ్లే కాలవపై అక్రమంగా నిర్మించిన ఐస్ ఫ్యాక్టరీని సోమవారం మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు కూల్చివేశారు. ఆదివారం కవిరాజ్‌నగర్, చైతన్యనగర్ వాసులు కాల్వపై అక్రమ నిర్మాణాలు తొలగించాలని ధర్నా నిర్వహించారు. అంతేకాక కవిరాజనగర్‌కు పరుచూరి నరేంద్రకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో స్పందించిన నగరపాలక అధికారులు అక్రమ నిర్మాణాన్ని ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. కాగా ఆదివారం వరద ఉధృతి సమయంలో మునిసిపల్ మేయర్ నీరజ, కమిషర్ అభిషేక్ అగస్త్య అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశాలు జారీచేయడం గమనార్హం.



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

సర్టిఫికెట్లు, డాక్యుమెంట్ల జారీకి చర్యలు

- ప్రత్యేక బృందాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- మీసేవ ద్వారా ఉచితంగా అందజేస్తాం
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంటౌన్,సెప్టెంబరు 9: ముంపు ప్రాంతాల్లో భారీవర్షాలు, వరదల వల్ల సర్టిఫికెట్లు, విలువైన డాక్యుమెంట్లు పోగొట్టుకున్న వారికి 'నాఖమ్మం కోసం-నేను' కార్యక్రమంలో భాగంగా వాటిని జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సర్టిఫికెట్ల జారీపై చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాలు, వరదలతో సామగ్రితో పాటు సర్టిఫికెట్లు, ఇతరత్రా పత్రాలు పోగొట్టుకున్న ముంపు ప్రాంతాలవారికి సర్టిఫికెట్లు జారీకి పకడ్బందీ కార్యాచరణ చేపట్టామన్నారు.

ఈ ప్రక్రియ కోసం ఖమ్మం నగరపాలకసంస్థ పరిధి మినహాయించి, గ్రామీణ ప్రాంతాలు, సత్తుపల్లి, వైరా, మధిర పట్టణప్రాంతాల్లో 72 బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు ముంపు ప్రాంతాల్లో పర్యటించి దరఖాస్తులు స్వీకరిస్తాయన్నారు. ఇంటి యజమాని నుంచి దరఖాస్తుల స్వీకరణలో భాగంగా తమకు, తమ పిల్లలకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఇతర పత్రాల వివరాలను దరఖాస్తులో పొందుపరచాలన్నారు. దరఖాస్తులో ఉంచిన వివరాల ఆధారంగా సంబంధిత అధికారులతో సర్టిఫికెట్ల జారీకి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ 10రోజులపాటు ఉంటుందన్నారు. ఏరోజుకారోజు సాయంత్రం శాఖల వారీగా సమీక్షించి, రిజిస్టర్‌లలో నమోదు చేయాలన్నారు. సర్వేలో మిస్సయిన దరఖాస్తుదారులకు సర్వేప్రక్రియ ముగిసిన అనంతరం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వారినుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తుదారునికి సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు పొందిన తరువాత లామినేషన్ చేసి, దరఖాస్తుదారుడికి ఇంటివద్దనే అందజేస్తామన్నారు. సర్టిఫికెట్ల జారీకి మీసేవ, ధరణి, ఇతరత్రా రుసుములను ప్రభుత్వమే చెల్లించి, దరఖాస్తుదారుడికి ఉచితంగా సర్టిఫికెట్లు అందచేస్తామన్నారు.

విదేశాల్లో అడ్మిషన్లు, ఉపాధి తదితర అత్యవసరాలు ఉన్నవారు తమ హాట్‌లైన్ నెంబర్‌ను తెలియచేస్తూ టోల్‌ఫ్రీ నెంబర్ 1077ను సంప్రదించాలని, 9063211298 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా రుజువులు పంపాలన్నారు. వారికి వారంరోజుల్లోగా ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందచేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు.



సర్టిఫికెట్ల జారీపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం నగరపాలకసంస్థ పరిధిలో..

ఖమ్మం నగరపాలకసంస్థ పరిధిలో ముంపు ప్రభావిత 14 డివిజన్లలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, సర్టిఫికెట్లు,విలువైన పత్రాలు కోల్పోయిన వారికి మంగళవారం మధ్యాహ్నం నుంచి దరఖాస్తులు స్వీకరణ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 46,47,48 డివిజన్లకు సంబంధించి నయాబజార్ ప్రభుత్వ పాఠశాలలో, 11వ డివిజన్‌కు సంబంధించి ఐటీహబ్‌లో, 16వ డివిజన్‌కు సంబంధించి ధంసలాపురం ఎంపీ ప్రాథమిక పాఠశాలలో, 17వ డివిజన్‌కు సంబంధించి గీతాంజలి పాఠశాలలో, 49వ డివిజన్‌కు సంబంధించి డీఆర్‌డీవో కార్యాలయంలో, 28,29,30 డివిజన్లకు సంబంధించి రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో,59,60 డివిజన్లకు సంబంధించి రామన్నపేట రైతు వేదికలో, 34,35 డివిజన్లకు సంబంధించి గాంధీ చౌక్‌లోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమీక్షలో నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ తదితరులు పాల్గొన్నారు.



చేతులు మారిన అసైన్‌మెంట్ భూమి

అసైన్‌మెంట్ భూముల క్రయవిక్రయాలు

- అక్రమంగా వెలుస్తున్న వాణిజ్య సముదాయాలు
- ఉన్నత వర్గాలకు దక్కుతున్న హక్కులు
- రాజకీయ అండతో విచారణకు నోచని వైనం

సత్తుపల్లి, సెప్టెంబరు 9: సత్తుపల్లి నియోజకవర్గంలో గత ప్రభుత్వాలు భూమి లేని నిరుపేదలకు వ్యవసాయ భూములను పంపిణీ చేశాయి. దశాబ్దాల క్రితం పేదలకు పంపిణీ చేసిన అసైన్‌మెంట్ భూములు వందలాది ఎకరాలు పరాధీనమయ్యాయి. అసైన్‌మెంట్ భూములను పేదల నుంచి అతి తక్కువ ధరకు కొనుగోలు చేయగా అధికారులు కూడా కొనుగోలు చేసిన వారికి అర్హత లేకపోయినా హక్కులు కల్పించి పాస్‌పుస్తకాలు జారీ చేయటం పలు విమర్శలకు దారితీస్తోంది. అసైన్‌మెంట్, ప్రభుత్వ భూమలకు రక్షణగా నిలవాల్సిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా హక్కులు కల్పించటం అధికారుల పనితీరుకు అద్దంపడుతోంది.

ఇదీ పరిస్థితి

సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాలు ఉండగా నియోజకవర్గాలకు పునర్విభజనకు ముందు తల్లాడ మినహా మిగిలిన మండలాలున్నాయి. 1969-70 నుంచి 2000 సంవత్సరం మధ్యలో ప్రభుత్వాలు పేదలకు వ్యవసాయ భూములను పంపిణీ చేశారు. వందల ఎకరాలు నిరుపేదలకు సాగు నిమిత్తం పంపిణీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలకు అస్సైన్డ్ చేసిన భూముల క్రయవిక్రమాలను నిషేధిస్తూ పీవోటీ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం అసైన్‌మెంట్ భూములు అమ్మకం, కొనుగోలు చేయకూడదు. ఒక వేళ ఎవరైనా అసైన్‌మెంట్ భూమి అమ్మితే తిరిగి భూమి అస్సైనీకి అప్పగించాలి. లేదా కొనుగోలు చేసిన వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులై ఉంటే వారి పేరుతో బదిలీ చేసే అవకాశం మాత్రమే ఉంది. కాని భూస్వాములు కొనుగోలు చేసిన సమయంలో వారి పేరుతో అధికారులు రికార్డుల్లో మార్చి వారికి కూడా హక్కులు కల్పించిన సంఘటనలు ఉన్నాయి.

చేతులు మారిన వందల ఎకరాలు

ఈ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలు రావటంతో నియోజకవర్గంలో వందలాది ఎకరాల అసైన్‌మెంట్ భూముల క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో కూడా పెద్ద మొత్తంలో అసైన్‌మెంట్ భూములు చేతులు మారగా ఇంకా ఇదే పరిస్థితి కొనసాగుతూనే ఉంది. ధరణి పోర్టల్ రాకముందు భూస్వాములు కొనుగోలు చేసిన భూములకు సంబంధించి అధికారులు పాస్‌పుస్తకాలు జారీ చేశారు. ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చే సమయంతో ఎల్‌ఆర్‌యూపీ సమయంలో వివరాలు ధరణిలో నమోదు చేసే క్రమంలో అసైన్‌మెంట్ భూముల యజమానుల పేర్లు తొలగించి కొనుగోలు చేసిన భూస్వాముల పేర్లు నమోదు చేసి కొత్త పాస్‌పుస్తకాలు జారీ చేశారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో వేంసూరు, సత్తుపల్లి మండలాల్లో ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారికి కూడా అసైన్‌మెంట్ భూములపై హక్కులు కల్పించారనే విమర్శలున్నాయి. అసైన్‌మెంట్ భూముల క్రయవిక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి.

పట్టా నెంబర్లతో రిజిస్ట్రేషన్

ధరణి అమల్లోకి వచ్చిన తరువాత అసైన్‌మెంట్, ప్రభుత్వ భూములు నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో అసైన్‌మెంట్ భూముల యజమాని పేరు మారే అవకాశం లేకపోవటంతో భూములు కొనుగోలు చేసిన రైతులు అదే రెవెన్యూ గ్రామంలోని పట్టా భూమి సర్వే నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని 40 సర్వే నెంబర్‌లో భూములు కొనుగోలు చేసిన వారు వాణిజ్య సముదాయాలు నిర్మించుకున్నారనే ఆరోపణలున్నాయి. కొనుగోలుదారులు భూస్వాములైనప్పటికీ వారి పేరుతో పాస్‌పుస్తకాలు అధికారులు జారీ చేసారు. మండలంలోని కొమ్మేపల్లి రెవెన్యూ పరిధిలో అసైన్‌మెంట్ భూములు చేతులు మారాయి. కాకర్లపల్లి, తుంబూరు, రుద్రాక్షపల్లి తదితర గ్రామాల్లో అసైన్‌మెంట్ భూముల క్రయవిక్రమాలు జరిగాయి. సత్తుపల్లి పట్టణంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ, అసైన్‌మెంట్ భూములు పరాధీనమయ్యాయి. పట్టణంలో ఇళ్ల స్థలాలకు డిమాండ్ ఉండటం మారుమూల ప్రాంతమైనప్పటికీ గజ కనీసం 20 వేల ధర ఉంది. అసైన్‌మెంట్ భూములు కూడా ఇళ్ల స్థలాలు మారిపోయాయి. అనేక మంది అసైన్‌మెంట్ భూములను ఇళ్ల స్థలాల క్రింద కొనుగోలు చేసి, మరికొందరు ఎకరాల లెక్కన కొనుగోలు చేసి సమీపంలోని పట్టా నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.వందల కోట్ల అసైన్‌మెంట్ భూములు పరాధీనమైనా పట్టించుకునే వారు లేరు. అసైన్‌మెంట్ భూముల క్రయవిక్రయాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని పలువురు కోరుతున్నారు.

ఈ నగరానికి ఏమైంది?

(5వ పేజీ తరువాయి)

తీరును పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణం పూర్తయిన తర్వాత అనుమతుల ప్రకారం నిర్మాణాలు చేశారా?లేదా వంటి విషయాలను పరిశీలించి అసెస్‌మెంట్లు వేసి

ఇంటి నెంబర్లు కేటాయించిన పరిస్థితులు చూస్తే అధికారులు అక్రమార్కులకు ఏ తీరున వంతపాడారో అర్థమవుతోంది. అక్రమార్కులు తమకున్న స్థలానికి మించి కాల్వపైకి నిర్మాణాలు చేపట్టడంతో వేలాది ఇళ్ల మోకాళ్లలోతు నీళ్లలో మునకకు గురైనట్టు స్పష్టమవుతోంది.

కాగా ప్రస్తుతం ఆయా బఫర్ జోన్‌లో ఉన్న ఆక్రమణలు తొలగించాలంటే అనుమతులు అడ్డంకిగా మారినట్టుగా కొందరు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికి సంబంధిత కాల్వకు సంబంధించిన పూర్తిమ్యాపు తమ దగ్గర లేదని, సదరు కాల్వకు సంబంధించిన మ్యాపును ఇరిగేషన్‌శాఖ వారిని అడిగామని వారం అయినా పంపడంలేదని టౌన్ ప్లానింగ్ అధికారులు చెబుతుండటం గమనార్హం. తమకు సంబంధించిన కాల్వను కాపాడుకునే బాధ్యత ఇరిగేషన్ శాఖ వారికి లేదా అని కార్పొరేషన్ అధికారులు... అనుమతులు ఇచ్చి నిర్మాణాలు చేసేటప్పుడు పట్టించుకోవాల్సిన బాధ్యత కార్పోరేషన్ వారికి లేదా అని ఇరిగేషన్ శాఖ.. ఒకరిపై మరొకరు నిందలేసుకునే ప్రయత్నం చేసుకుంటున్నారు. ఇదంతా పక్కన పెడితే అసలు మాస్టర్ ప్లాన్‌లో మ్యాపులో కాల్వ అనేది లేదా? వంటి ప్రశ్న తలెత్తుతోంది. అది ఉన్నప్పుడు బఫర్ జోన్లలో నిర్మాణాలకు అనుమతులు ఎలా అనుమతులిచ్చారనేది ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఆక్రమణలకు సంబంధించి గతంలో పదుల కొద్దీ ఫిర్యాదులు వచ్చినా కనీసం కేఎంసీ అధికారులు పట్టించుకోకుండా పక్కన పెట్టారన్న వాదన వినిపిస్తోంది.

కొద్దిపాటి వర్షానికే...

వారం రోజుల క్రితం ఖమ్మం అర్బన్ పరిధిలో 15.34 సెంమీ వర్షపాతం నమోదైంది. ఆ సమయంలో పెద్దఎత్తున వరద వచ్చి చేరిన కారణంగానే కాలనీలు మునిగిపోయాయంటూ కొందరు అధికారులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అయితే వారం రోజులు తిరగకముందే కేవలం 5.7సెంమీ వర్షపాతానికే రెండోసారి మళ్లీ వరద మునకకు గురవడం ఖమ్మంలో చర్చనీయాంశంగా మారింది. నగరంలోని చైతన్య నగర్, కవిరాజ్ నగర్‌తోపాటు, మరికొన్ని కాలనీలకు నడుములోతు నీళ్లు వచ్చి చేరాయి. ఖమ్మం నగరంలోని రాపర్తినగర్ సమీపంలోని బైపాస్‌రోడ్డు మీదకు నీళ్లు పొంగిపొర్లాయి.

ఆయా కాలనీ వాసులకు అర్థరాత్రి నుంచి కంటిమీద కునుకులేని దుస్థితి ఏర్పడింది. దాంతో ఆయా డివిజన్లలో నివాసం ఉండే స్థానికులు కాల్వపై ఉన్న ఆక్రమణలు తొలగించాలంటూ వైరారోడ్డుపై దర్నా నిర్వహించారు. అనంతరం ఆయా కాల్వను పరిశీలించిన మేయర్ పునకొల్లు నీరజ, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య వరద నీరు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ పరిష్కారంలో భాగంగా ఓ అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశాలు జారీ చేయగా... సోమవారం కార్పొరేషన్ సిబ్బంది దానిని కూలగొట్టారు. కాలనీలు నిత్యం మునకకు గురవకుండా ఉండాలంటే ఆక్రమణలు తొలగించాలని, కాల్వకు రెండు వైపులా ఎత్తుగా రక్షణ గోడలు నిర్మించాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.



బైపాస్ రోడ్డులో వెడల్పుగా ఉన్న కాలువ

క్రైం సమాచారం

మావోయిస్టు మాసయ్య కోసం గాలింపులు

కరకగూడెం, సెప్టెంబరు9: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం దోనాల గుట్ట ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న మావోయిస్టు నాయకుడు మాసయ్య ఆచూకీపై ఉత్కంఠ నెల కొంది. ఎన్‌కౌంటర్ జరిగి సుమారు ఐదు రోజులవుతున్నా కనీసం ఆచూకీ లేక పోవడం చర్చ సాగుతోంది. కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందగా.. మరో మావోయిస్టు మాసయ్య తప్పించుకున్నాడని పోలీసులు ప్రక టించిన దగ్గర నుంచి కరకగూడెం మండలంలో ఎవరి మాట విన్నా ఇదే వినిపి స్తోంది. కాగా సదరు వ్యక్తి కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ, ప్రత్యేక బలగాలు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నాయి. రఘునాథపాలెం మోతే ప్రాంతంలోని దోనాల గుట్ట అడవులతోపాటు ఇతర మండలాల్లోని అడవుల్లో, సరిహద్దుల్లో గ్రేహౌండ్స్ ముమ్మురంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అలాగే ఛత్తీస్‌గఢ్ వెళ్లే దారులపై తనిఖీలు చేస్తున్నారు. గోదావరిపై నిఘాపెట్టి, ఫెర్రీ పాయింట్లపై డేగ కన్ను వేశారు.

ప్రమాదవశాత్తూ చెరువులో పడి వ్యక్తి మృతి

దమ్మపేట, సెప్టెంబరు9: ప్రమాదవశాత్తూ చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో సోమవారం జరిగింది. స్థాని కులు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మారుతి బాబు రావు (50) సోమవారం గ్రామ సమీపంలోని చింతల చెరువులో చేపలు పట్టేందుకు మరికొందరితో కలిసి వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో చెరువులోకి బాబురావు దిగగా, చెరువులో ఉన్న గుంతలో పడిపోయాడు. పక్కనే ఉన్న కొందరు అతడిని చెరువులో నుంచి బయటకు తీసేటప్పటికే అతడు మృతి చెందాడు. మృతుడి కుమా రుడు మహేష్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయి కిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచా రణ చేస్తున్నారు.

నారాయణపురంలో పాడి గేదె..

బోనకల్, సెప్టెంబరు 9: మండలంలోని నారాయణపురం గ్రామంలో సోమవారం కరివేద రవికి చెందిన పాడి గేదె మృతి చెందింది. వరుసగా కురుస్తున్న వర్షాల వలన గేదే మృత్యువాత పడిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. దాదాపు రూ.80 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్సుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

ఏన్కూరు, సెప్టెంబరు9: ఏన్కూరు మండలం గార్లొడ్డు గ్రామ సమీపంలో మంగ ళవారం తెల్లవారుజామున జరిగిన బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం భద్రాచలం నుంచి హైదరాబాద్ మియాపూర్‌కు 17మంది ప్రయాణీకులతో బయలుదేరిన లహరి లగ్జరి బస్సు గార్లొడ్డు దగ్గరకు రాగానే ఎదు రుగా వేగంగా వస్తున్న లారీని తప్పించి పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రక్కును ఢీకొ ట్టింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జైంది. బస్సులోని ఐదుగురికి స్వల్పగాయ లయ్యాయి. ఎస్‌ఐ బాదావత్ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

మద్యం పట్టివేత

బూర్గంపాడు, సెప్టెంబరు9: అనుమతులు లేకుండా ఏపీకి తరలిస్తున్న మద్యాన్ని సోమవారం బూర్గంపాడు పోలీసులు సారపాకలో పట్టుకున్నారు. పోలీ సులు తెలిపిన వివరాల ప్రకారం...ఏపీలోని ఎటపాక మండలం తోటపల్లి గ్రామా నికి చెందిన సునీల్ అనే వ్యక్తి పాల్వంచలోని ఓ మద్యం దుకాణంలో మద్యం కొను గోలు చేసి కారులో ఏపీకి తరలిస్తున్నాడు. ఈ క్రమంలో బూర్గంపాడు మండల పరి ధిలోని సారపాకలో ఎస్‌ఐ రాజేష్ సోమవారం సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా కారులో తరలిస్తున్న మద్యాన్ని గుర్తించారు. రూ.96,000ల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వ్యక్తితో పాటు మద్యం అమ్మిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలి పారు. కాగా పట్టుబడిన ఏపీకి చెందిన వ్యక్తి మీడియా ముసుగులో మద్యం దందా కొనసాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. తెలంగాణలో మద్యాన్ని కొనుగోలు చేసి, ఏపీలో అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

ములకపల్లి, సెప్టెంబరు9: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండ లంలోని ఓ గ్రామానికి చెందిన మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఆ మహిళ పట్ల గత నెల 27న అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈవిషయం తెలుసు కున్న బాధితురాలి కుమారుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

భద్రాద్రి దేవస్థానం ఉద్యోగి సస్పెన్షన్?

భద్రాచలం, సెప్టెంబరు9: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగిని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి స స్పెండ్ చేసి నట్లు తెలిసింది. రామాలయంలో ఇటీవల జరిగిన అంతర్గత మార్పుల్లో భాగంగా ప్రసాదాల కౌంటర్‌లో ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.చంటికుమార్‌ను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. విధి నిర్వహణలో సమయపాలన పాటించకపోవడం దేవస్థానానికి గతంలో చెల్లించాల్సిన నగదును చెల్లించకపోవడం లాంటి ఆరోపణలు రావడంతో, ఆలయాధికారులు ఈవో దృష్టికి తెచ్చినట్లు వినికిడి. ఈ క్రమంలో ఆయ నపై శాఖపరంగా చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

టీడీపీ సీనియర్ నేత సత్యనారాయణ మృతి

ఖమ్మం మామిళ్లగూడెం, సెప్టెంబర్ 9: ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ఖానాపురం 6వ డివిజన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గుత్త సత్యనారాయణ (75) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పార్థివ దేహాన్ని టీడీపీ నాయ కులు కేతినేని హరీష్, చింతనిప్పు నాగేశ్వరరావు, చల్లగుండ్ల రమేష్, తదితరులు సంద ర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

అనారోగ్యంతో వీఎస్‌ఎస్ చైర్మన్ నర్సింహారావు..

మణుగూరు, సెప్టెంబరు 9: మణుగూరు మండలంలోని మద్దులగూడెం గ్రామానికి చెందిన వీఎస్‌ఎస్ చైర్మన్ కలబోయిన నర్సింహారావు (52) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. కొంత కాలంగా కామెర్ల వ్యాధితో ఇబ్బంది పడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వన సంరక్షణ సమితి చైర్మన్‌గా చాలా కాలం పనిచేసి వీఎ స్ఎస్ చైర్మన్‌గా గుర్తింపు పొందారు. నర్సింహారావు మృతి పట్ల పలు పార్టీల నాయ కులు ఆదివాసీ సంఘ సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరా మర్శించారు.

మావోయిస్టుల బంద్ ప్రశాంతం



కరకగూడెంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రాజేందర్

దుమ్ముగూడెం/ చర్ల/కరకగూడెం, సెప్టెంబరు 9: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కర కగూడెం మండలం రఘునాథపాలెం మోతే ప్రాంతంలోని అడవిలో 5వ తేదీన గ్రేహౌండ్స్ పోలీసులకు మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్ కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి భద్రాద్రి కొత్తగూడెం అల్లూరి సీతరామరాజు డివిజన్ కార్యదర్శి ఆజాద్ 9వ తేదీన రాష్ట్ర బంద్‌కు పిలుపుని చ్చారు. సోమవారం మావోయిస్టు బంద్ ప్రశాంతంగా సాగింది. బంద్ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లోని ధర్మపేట వారాంతపు సంతకు స్థానిక వ్యాపారులు వెళ్లలేదు. సరిహద్దుల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు.

రూ.33 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి

కొత్తగూడెం, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో, జెన్కో సంస్థల నుంచి సింగ రేణికి రావాలసిన రూ.33 వేల కోట్ల బాకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. కార్మికుల జాగారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం పద్మావతి ఖని వద్ద ఎంబీఎస్ ఆధ్వ ర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి పి. మాధవ నాయక్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ.25 వేల కోట్లుగా ఉన్న బకాయిలు, నేడు రూ. 33 వేల కోట్లకు చేరిందన్నారు. వేల కోట్లు బకాయిలు చెల్లించటంలో ప్రభుత్వం అలసత్వం వహించటంవల్ల సింగరేణి సంస్థ ఆర్థిక ఇబ్బంది ఎదుర్కొం టుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మెగిలిపాక రవికుమార్, ఊట్ల గణేష్, సంగెం చందర్, గంధం సతీశ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న అంటువ్యాధుల భయం

మున్నేరు వరద బాధితులకు దగ్గు, జలుబు, అతిసారం



మున్నేరు వరద ప్రభావిత ప్రాంతంలో సంచార వైద్యశాల ద్వారా మందులు అందిస్తున్న దృశ్యం

ఖమ్మం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం జిల్లాలో మున్నేరు వరదల బీభత్సం, భారీవర్షా లతో నిలిచిన వరదనీరుతో అంటువ్యాధుల భయంతో ప్రజలు బీతిల్లుతున్నారు. వైద్యారోగ్యశాఖపరంగా జిల్లాలో వైద్యబృందాలను ఏర్పాటుచేసి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్న వరదలకు వ్యాధులు కూడా పొంచి ఉన్నాయి. ఇప్పటికే వరదలో తేమ నిమ్ము కారణంగా జలుబు, దగ్గులు బాధితులను పీడిస్తుండగా అతి సారం కేసులు కూడా నమోదవుతున్నాయి. జిల్లాలో మున్నేరు పరివాహకంలోని ఖమ్మంపట్టణంతో పాటు ఖమ్మంరూరల్ మండలం, తిరుమలాయపాలెం, చింత కాని, ఎర్రుపాలెం, మధిర, ముదిగొండ, తదితర మండ లాల్లో వర్షాలు, వరదలు వేల ఇళ్లను నీటముంచాయి. రోడ్ల, ఇళ్ల వరద బురదతో దుర్వాసన వస్తున్నాయి. పారిశుద్యం కార్మికులు జిల్లా వ్యాప్తంగా ముంపు గ్రామాల్లో శుభ్రం చేస్తున్నా ఇంకా దుర్వాసన వస్తూనే ఉంది. ఖమ్మం నగరంలో పునరావాస కేంద్రాల్లోను దుర్వాసన వ్యాధుల భయం వెంటాడుతూనే ఉంది. అక్కడే తిన్న ఆహారం పడేయడం, కొంతమంది అపరిశుభ్రంగా ఆవరణ ఉంచడంతో ఇబ్బం దులు తలెత్తుతున్నాయి. దీనికితోడు బోర్లు, పంపుల్లో బురద నీరు చేరడంతో నీరు కలుషి తమై ఎక్కడ డయేరియా ప్రబలుతుందోనన్న భయం కలుగుతోంది. జిల్లాలో ఇప్పటికే జ్వరాలు, అతిసారం కేసులు నమోదవుతు న్నాయి. ముంపు ప్రాంతాల్లో 896 టీంలు ఏర్పాటు చేసి ఇంటింటికి సర్వే చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 237 డయేరియా కేసులు నమోదు కాగా 14మంది తీవ్ర అస్వస్థతకు గుర య్యారు. వీరిని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తర లించి చికిత్స చేశారు. 5,200మంది వరదల అనంతరం తీవ్ర జ్వరాలకు గురికాగా దగ్గు, జలుబు తీవ్రతతో ఎక్కువమంది ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో వైద్య బృందాలు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాయని, మొబైల్ వైద్యబృందాలు కూడా ఏర్పాటు చేశామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి వి.సుబ్బారావు 'ఆంధ్ర జ్యోతి' తెలిపారు జిల్లాలో మొత్తం 896 వైద్యబృందాలు పనిచేస్తున్నాయని, ఇతర జిల్లాలనుంచి కూడా వైద్య సిబ్బందిని రప్పించి శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలి పారు. 36మొబైల్ వైద్యబృందాలు ఏర్పాటు చేశామని, ఖమ్మం కార్పొరేషన్‌లో పునరావాస కేంద్రాలతోపాటు ప్రతిడివిజన్‌లో వైద్యబృందాలు శిబిరాలు నిర్వహిస్తు న్నామన్నారు. ఇప్పటికే జిల్లాలో 5,200మంది జ్వరాల బారినపడిన వారికి చికిత్స అందించామని, 237 అతి సారం కేసులు నమోదుకాగా 14మంది తీవ్ర అస్వస్థ తకు గురికావడంతో వారిని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించామన్నారు. 50వేల ఇళ్లకు వెళ్లి ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశామన్నారు. పాము, కుక్క కాటు ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో మందులు కూడా సిద్ధంగా ఉంచామని వివరించారు.



వైద్య శిబిరంలో మందులు అందిస్తున్న దృశ్యం

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బారావు



కళాజాత ప్రదర్శనను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుబ్బారావు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు9: హెచ్ఐవీపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుబ్బా రావు అన్నారు. సోమవారం తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శలను నిర్వ హించారు. జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై పోలూరి రాము కళ బృందం ద్వారా పల్లె సుద్దులు కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని పాత బస్‌స్టాండ్‌లో కళాజాత కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా హెచ్ఐవీ టెస్టులు చేయించుకోవాలని అన్నారు. అలాగే జిల్లా ఉన్న అన్ని ఆయుష్ ఆరోగ్య మందిర్ లలో హెచ్ఐవీ పరీక్షలను ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకా శాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సమష్టి కృషితో ఖమ్మం జిల్లాను హెచ్ఐవీ రహిత జిల్లాగా మార్చాలని కోరారు. అనంతరం జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖాధి కారి డా. వెంకటరమణ (ఎయిడ్స్, లెపరసి) మాట్లాడుతూ ఈ అవగాహన కార్యక్రమాలు వచ్చే నెల అక్టోబర్ 31 వరకు జిల్లా వ్యాప్తంగా కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ సిబ్బంది డి. సత్య కుమార్. మహమూద్ అలీ, జాగృతి స్వచ్ఛంద మేనేజర్ కొండల్ రావు, సిబ్బంది, జనవాణి స్వచ్ఛంద సేవ సంస్థ మేనేజర్ సుందర్, సిబ్బంది, లింకు వర్కర్స్ డీఆర్పీ శివ తది తరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలి

యూనియన్ గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ఏఐటీయూసీ నేతలకు గుర్తింపు పత్రం అందజేసిన సింగరేణి సీఎండీ బలరాం

ఇల్లెందు/కొత్తగూడెం, సెప్టెంబరు 9: (ఆంధ్ర జ్యోతి) సింగరేణి యాజమాన్యం ఏఐటీయూసీకి గుర్తింపుపత్రం అందించడంతో బాధ్యత తీరినట్లు కాదని, పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు గుర్తింపు సంఘంతో యాజ మాన్యం అన్ని స్థాయిల్లో చర్చలు జరపాలని ఏఐ టీయూసీ గౌరవ అధ్యక్షుడు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సింగరేణి సీఎండీ బలరాం గుర్తింపు పత్రాన్ని ఎమ్మెల్యే కూనంనేని యూనియ న్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారా మయ్య, రాజ్‌కుమార్‌లకు అందజేశారు. సింగరేణి సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి 8 నెలలు గడిచిన తరువాత యాజమాన్యం ఎట్టకె లకు గుర్తింపు సంఘంగా గెలుపొందిన ఏఐటీ యూసీ ప్రతినిధి బృందానికి గుర్తింపు పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుర్తింపు సంఘం కాల పరిమితి నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతుందని, కానీ రెండేళ్ల కాల పరిమితి తోనే గుర్తింపు పత్రం జారీ చేశారని దీనిపై న్యాయ పోరాటం చేస్తామని అన్నారు. సింగరేణి కాలరీస్ యాజమాన్యం కార్మి కుల పెండింగ్ సమస్యలు పరిష్కరించేందుకు గుర్తింపు సంఘంతో సమావేశాలు నిర్వహించా లని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వైవి.రావు, ఎల్.ప్రకాశ్, స్వామి, రాజా రత్నం తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గేవరకు ప్రభుత్వమే పునరావాసం కల్పిస్తుంది

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



రాజీవ్‌నగర్ ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

వైరా, సెప్టెంబరు 9: వరద తగ్గేవరకు ప్రభుత్వమే పునరావాసం కల్పిస్తుందని కలె క్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం వైరాలో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించారు. మునిసిపాలిటీ నాల్గోవార్డు పరిధిలో ముంపు ప్రాంతమైన రాజీవ్‌నగర్ కాలనీలో కలెక్టర్ పర్యటించి బాధితులతో మాట్లాడారు. వరదల సమయంలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బంది లను కలెక్టర్ ముందు ఏకరువు పెట్టారు. ముంపునకు గురైన ఇళ్లకు వెళ్లి కలెక్టర్ పరిశీ లించారు. అనంతరం వైరా రిజర్వాయర్‌లోకి తెప్పపై వెళ్లి పరి సరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వరద ముంపుకు గురవు తున్న కాలనీ ప్రజలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బాధితులకు అందించాల్సిన పునరావాస కార్యక్రమాలపై మునిసిపల్ కమిషనర్ చింతా వేణుకు కలెక్టర్ ఆదేశాలి చ్చారు. జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నవీనాజ్యోతి, అధ్యాప కులు కలెక్టర్ వద్దకు వెళ్లి శిథిలావస్థలో ఉన్న జూనియర్ కళా శాల దుస్థితి గురించి వివరించారు. వెంటనే స్పందించిన కలె క్టర్ జూనియర్ కాలేజీకి చేరుకొని శిథిలావస్థలో ఉన్న భవనా లను పరిశీలించారు. ఆతర్వాత ఇంటర్ ఒకేషనల్ విద్యార్థు లకు కొద్దిసేపు పాఠాలు బోధించారు. అనంతరం కాలేజీ ఆవ రణంలో కలియతిరిగారు. వెంటనే విద్యార్థినీ, విద్యార్థులకు, అధ్యాపకులకు వేర్వేరుగా ఆరు బాత్‌రూమ్‌లు యుద్ధప్రాతిప దికన మునిసిపల్ ఇంజనీరింగ్ పర్యవేక్షణలో నిర్మించాలని అందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని కమిష నర్ వేణుకు కలెక్టర్ స్పష్టం చేశారు. అంతేకాకుండా ఆవర ణంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కకు షిఫ్టు చేయాలని, ఆవరణంలో నిలిచి ఉన్న మురుగునీటిని వెంటనే ప్రహరీగోడకు రంధ్రం వేసి తొలగించాలని కలెక్టర్‌ను ఆదేశిం చారు. పీడీఎస్‌యూ ఇతర విద్యార్థిసంఘాల నాయకులు జూనియర్ కాలేజీలోని సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. తాను వైరా వచ్చే వరకు కాలేజీలో సమస్య లపై తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రిన్సిపాల్‌ను కలె క్టర్ ప్రశ్నించారు. వైరాకు కలెక్టర్ కార్యాలయం దగ్గర్లోనే ఉన్నందున తాను ఇక్కడకు వచ్చేవరకు వేచి ఉండకుండా ఈ సమస్యలను ఎప్పుడో తన దృష్టికి తీసుకొచ్చి ఉంటే ఇప్పటికే వీటిని పరిష్కరించేవాళ్లం కదా అని కలెక్టర్ వ్యాఖ్యానించారు. ఇకముందు ఏ సమస్యలున్నా వెంటనే తన దృష్టికి తీసుకురా వాలని ప్రిన్సిపాల్ నవీనా జ్యోతికి కలెక్టర్ సూచించారు. ఆయన వెంట డీటీ సురేష్‌బాబు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరు, సెప్టెంబరు9 : మణుగూరు లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఇంగ్లీష్, ఎక నామిక్స్ పోస్టులకు అతిథి అధ్యాపకులుగా నియమిం చేందుకు అర్హత గత వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి. భద్రయ్య తెలిపారు. సోమవారం ఇందుకు సంబంధించిన వివరా లను ప్రకటించారు. సెప్టెంబరు11 సాయంత్రం ఐదు గంటల లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసక్తి గల వారు దరఖాస్తులు అందించాలని తెలిపారు. పీజీలో 55శాతం మార్కులు, నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. 12వ తేదీన ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు డెమోలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

యువ శాస్త్రవేత్తను కోల్పోవడం బాధాకరం

ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



అశ్వని చిత్రపటం నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి, సెప్టెంబరు9: దేశానికి ఎంతో సేవలు అందించాల్సి ఉన్న యువ శాస్త్రవేత్త నూనవత్ అశ్వ ని, ఆమె తండ్రి మోతీలాల్ మృతి చెందడం బాధాక రమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. సోమవారం ఆమె దశదిన సంస్కరణ కార్య క్రమంలో పాల్గొని నివాళులర్పించారు. అశ్వని కుటుంబాన్ని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా గంగారం తండాకు వచ్చి కుటంబసభ్యుల భరోషాకల్పించారని పేర్కొన్నారు. అన్ని వెళ్లలా కుటుంబానికి తాను అందు బాటులో ఉంటానని అన్నారు. ఈకార్యక్రమంలో వైరా మాజీ ఎమ్మెల్యేలు రాములు నాయక్, మదన్‌లాల్, చంద్రావతి, ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌రావు తదితరులు పాల్గొని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు9: మూడు రోజుల పాటు వాతావరణ శాఖ జిల్లాకు భారీ వర్ష సూచన చేసిందని అధికా రులు అప్రమత్తంగా ఉం డాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తెలిపారు. సోమవారం కలె క్టరేట్‌లో ఆయన చాంబర్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దా ర్లతో వర్షాల జాగ్రత్తలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల స్థాయిలో తహసీల్దార్లు, పోలీస్, పంచాయతీ, నీటిపారు దల శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని, పరిస్థితు లను బట్టి నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు వెళ్లాల న్నారు. గతంలో ప్రమాదకరంగా మారిన కల్వర్టులు, క్యాజ్‌వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు.

టి. వెంకటాపురంలో పెద్దపులి సంచారం..?



పులి ఆనవాళ్ల కోసం పరిశీలిస్తున్న పోలీసులు

కల్లూరు, సెప్టెంబరు 9: మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామ పరిసర వాగు పరివాహక ప్రాంతంలో పెద్దపుల్లి సంచారంపై వచ్చిన వదంతులపై స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. స్థానికు లు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వెంకటాపురం గ్రామానికి చెందిన పాడి రైతు, వల్లెబోయన వెంకటేశ్వర్లు గ్రామ సమీపాన గల వాగు దగ్గర వరి పొలాల వద్దకు పశుగ్రాసం కోసం వెళ్లాడు. వరి పొలంలో గ్రాసం కోస్తుండగా సమీపాన గల వాగు వద్ద పొలం గట్టుపై పెద్దపులి ఆకారంలో జంతువు కనిపించగా తాను గ్రాసం కోస్తున్న గట్టు ప్రదేశంలో ప్రాణ భయంతో దాక్కున్నానని బాధిత రైతు తెలిపాడు. పులి ఆకారంలో గల జంతువు కొంచెం దూరం వెళ్లడంతో తాను ప్రాణభయంతో ఇంటికి వచ్చానని తెలిపాడు. గ్రామానికి తిరిగి వస్తుండంగా కొంత మంది రైతులకు ఈ విషయమై సమాచారం అందించానని చెప్పాడు. ఈ విషయాన్ని వారు గ్రామ ప్రజలకు తెలియపరిచారన్నారు. దీంతో గ్రామ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పులి సంచా రంపై వచ్చిన వదంతులపై గుంపులు గుంపులుగా ఒక చోట చేరి ప్రజలు చర్చించుకున్నారు. ఈ మేరకు వెంకటా పురంలో పులి సంచారంపై వచ్చిన వదంతులపై మండల స్థాయి అధికారులకు రాత్రి 7గంటలకు సమాచారం అం దించారు. దీంతో స్థానిక ఎస్‌ఐ షాకీర్, అటవీశాఖ బీట్ ఆఫీసర్లు అజమ్‌అలీ, భరత్‌కుమార్‌లు పులి పాద ముద్ర ల సేకరణను పరిశీలించే ప్రయత్నం చేశారు. చీకటి పడ టంతో మంగళవారం మరోసారి సదరు ప్రదేశానికి వెళ్లి పరిశీలించనున్నట్లు అటవీశాఖ బీట్ అఫీసర్లు తెలిపారు.

ముత్తంగి అలంకారంలో భద్రాద్రి రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, సెప్టెంబరు 9: భద్రాచలం లోని సీతారామచంద్రస్వామి వారు సోమ వారం సందర్భంగా ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఈ సందర్భంగా అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే నిత్యక ల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యక ల్యాణం వైభవంగా జరిగింది.

సమస్యలను త్వరగా పరిష్కరిస్తాం

కాంగ్రెస్ నాయకుడు దయానంద్



సమస్యలపై పీవోతో మాట్లాడుతున్న డా.దయానంద్

సత్తుపల్లి, సెప్టెంబరు9: కిష్టారం గ్రామస్థుల సమస్య లను త్వరగా పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. ఇటీ వల కురుస్తున్న వర్షాలతో పాటు సింగరేణి బాంబ్ బ్లాస్టిం గుల కారణంగా మండలంలోని కిష్టారం గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఆయన సోమవారం గ్రామాన్ని కిష్టారం ఓసీ పీవో ఎంవీ.న రసింహారావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బాధితులు తమ గోడు ను విన్నవించారు. సుమారుగా 200కు పైగా ఇళ్లు దెబ్బతిన్నాయని, ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా ఇళ్లన్నీ కురుస్తున్నాయని, స్లాబ్ పెచ్చులూడి గాయాలవుతున్నాయని వాపోయారు. ఇంకా పదుల సంఖ్యలో ఇంటి గోడలు కూలడంతో ఇళ్లు ఎప్పుడు కూలుతాయోననే భయంతో బయటనే నిద్రిస్తున్నా మని, వర్షం కారణంగా సరైన వ్యవస్థ లేని తమ కాలనీలో నీరంతా ఇళ్లలోకి చేరుతున్నాయని, అదేవిధంగా ఎర్త్ కార ణంగా ఇంటిగోడలు విద్యుత్ షాక్ కొడుతున్నాయని ఆయన ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు మార్లు అధికారులకు మొర పెట్టుకున్నా సమస్యలు పరి ష్కారం కాలేదని గ్రామస్థులు వాపోయారు. దీంతో స్పందిం చిన దయానంద్ కలెక్టర్, సింగరేణి సీఎండీతో మాట్లాడి త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పదవికి పోటా పోటీ



ఇల్లెందు వ్యవసాయ మార్కెట్

ఇల్లెందు, సెప్టెంబరు9: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పాలక వర్గాన్ని నియమించేందుకు ఎమ్మెల్యే కోరం కనకయ్య కసరత్తు ప్రారంభించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబుబాబాద్ మూడు జిల్లాల పరిధిలో ఇల్లెందు, పినపాక, వైరా, శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని బయ్యారం గార్ల, కామే పల్లి, గుండాల, కారేపల్లి, ఆళ్లపల్లి, ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ విస్తరించ బడి ఉంది. ఫలితంగా మార్కెట్ కమిటీ పాలక వర్గం నియామకానికి స్థానిక ఎమ్మెల్యే కనకయ్య భారీ కస రత్తు చేస్తున్నారు. వైరా , పినపాక నియోజకవర్గాల ఎమ్మెల్యేల సమన్వయంతో కమిటీ నియామకానికి సమాలోచనలు ప్రారంభించారు.

ఎమ్మెల్యే సన్నిహితులుగా ఉన్న గార్ల మండలానికి చెందిన మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, ఇల్లెందు మండలం మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముక్తి కృష్ణ, ఇల్లెందు మండలానికి చె ందిన బానోత్ రాంబాబు, బయ్యారం మండలానికి చెందిన భూక్యా ప్రవీణ్‌లు చైర్మన్ పదవీని ఆశిస్తు న్నారు.

గత మూడేళ్లుగా ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌కు పాలక వర్గం లేకపోవడంతో మార్కెట్ అలంకార ప్రాయంగా మిగిలింది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం పలు వ్యవసాయ మార్కెట్‌లకు కమిటీలను నియ మించింది. ఈ నేపథ్యంలో ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కు నూతన పాలక వర్గాన్ని నియమించేం దుకు ఎమ్మెల్యే కోరం యత్నాలు చేపట్టారు. అయితే ఎన్నికల తరుణంలోనే ఇల్లెందు మండలం మాణి క్యారం మాజీ ఎంపీటీసీ భర్త బానోత్ రాంబాబు తది తరులు న్యూ డెమోక్రసీ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఆ తరుణంలోనే మార్కెట్ కమిటీ చైర్మన్ పద విని ఆయనకు ఇచ్చేందుకు హామీ ఇవ్వడంతో బానోత్ రాంబాబును ఇల్లెందు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించడం ఖాయమని భావిస్తున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కనకయ్య ప్రతిపాదనల పట్ల రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సైతం సానుకూలంగా ఉన్నట్లు సమాచారం. డైరెక్టర్లను నియ మించేందుకు పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలి సింది. మొత్తం మీద పదవులను దక్కించుకునేందుకు ఆశవహులు తమ ప్రయత్నాలను సాగిస్తున్నారు.

లభ్యంకాని గల్లంతైన వ్యక్తి ఆచూకీ



చింతకాని, సెప్టెంబరు 9: మండల పరిధిలోని తుమ్మలమ్మ చెరువులో చెపల వేటకు వెళ్లి పిల్లి వీరస్వామి (58) గల్లంతైన విషయం తెలిసిందే. ఆదివారం సాయంత్రం నుంచి మృతదేహం కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలిస్తున్నారు. ఇంతవరకు ఆచూకీ లభించలేదు. గాలింపు ప్రక్రియను అడిషనల్ కలెక్టర్ మధుసూదన్, ఆర్డీవో గణేష్, వైరా సీఐ సాగర్, ఎస్ఐ నాగుల్‌మీరా పర్యవేక్షిస్తున్నారు.

దాతలిస్తేనే భోజనం

- మున్నేరు బాధితుల ఇళ్లల్లో వెలగని పొయ్యి
- నిత్యావసరాలు ఇచ్చినా వండుకోలేని దుస్థితి





అన్నదానం కోసం తరలి వచ్చిన పద్మావతినగర్ వాసులు, రాకాసితండాలో సమస్యలు తెలుసుకుంటున్న రాయల, కుంచపర్తి పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

ఖమ్మంసాంస్కృతికం,సెప్టెంబరు9: మున్నేరుకు వరద లొచ్చి సుమారు వార గడుస్తున్నా.. కొందరి ఇళ్లల్లో నేటికీ పొయ్యి వెలగటం లేదు. వండుకునేందుకు తినేందుకు ఎటువంటి ఆధారం లేకపోవటంతో ఏపూట కాపూట దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. మున్నేటి వరద ధాటికి గురైన వారం రోజుల నుంచి స్థానికుల ఇళ్లల్లో వంటలు చేసుకునే పరిస్థితి లేదు.. ప్రకృతి పగబట్టినట్లు మున్నేటి వరద ఇళ్లపై విరుచుకు పడటంతో నిత్యావసరాలు, సామాన్లు, సర్వం కోల్పోయిన బాధితులు దాతలు అందించే ఆహారాలతో సరిపెట్టు కోవలసి వస్తోంది.బియ్యం, తదితర నిత్యావసర వస్తువులు కానీ, గ్యాస్‌పొయ్యిలు, కొనుక్కొనేందుకు చేతిలో డబ్బులేక పోవటంతో దాతల దయాదాక్షిణ్యాలపై ఆధార పడుతున్నారు. తమ ప్రాంతంలో భోజనాలు పంచేందుకు దాతలు వస్తున్నారని తెలిస్తే స్థానికులు అందరూ అక్కడికి పరుగులు తీస్తున్నారు. కొందరు అక్కడే భోజనాలు చేస్తుండగా మహిళలు, పిల్లలు పళ్లాలు, పాత్రల్లో పెట్టుకొని ఇళ్లకు తెచ్చి తింటున్నారు.

కల్లూరు డివిజన్‌లో 62 కుటుంబాలు పునరావాస కేంద్రాలకు తరలింపు

కల్లూరు: కల్లూరు డివిజన్ పరిధిలో గల వేంసూరు మండలంలోని ఎర్రగుంటపాడు, కుంచపర్తి, కందుకూరు గ్రామాల్లో 62కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్ తెలిపారు. ఈ గ్రామాల్లో వరద ముంపును గుర్తించి ముందస్తు జాగ్రత్తగా వారంద రిని రైతువేదిక, సాంక్షేమ వసతి గృహాలకు తరలిం చామన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య చర్యలు

మధిరటౌన్:వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మునిసిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పారిశుధ్యంపై దృష్టి పెట్టారు. సోమవారం పలు వార్డుల్లో మునిసిపల్ సిబ్బందితో కౌన్సిలర్లు పారిశుధ్య చర్యలను చేయించారు. తొమ్మిది, పదో వార్డులో వర్షపు నీరు నిల్వ నీళ్లను తొలగించారు. 15వ వార్డులో కౌన్సిలర్ కోనా ధనికుమార్ బ్లీచింగ్ చల్లించారు, 13వవార్డులో కౌన్సిలర్ బిక్కి అనిత, 21వ వార్డులో కౌన్సిలర్ యర్రగుంట లక్ష్మీ పారిశుధ్య చర్యలను పర్యవేక్షించారు.

ఆటోడ్రైవర్లకు నిత్యావసరాలు పంపిణీ

ఖమ్మంబైపాస్‌రోడ్: మున్నేరు వరద బాధిత ప్రాంతంలో వరదలతో ఇబ్బందులకు గురైన ఆటోడ్రైవర్లకు బీజేపీ రాష్ట్ర నాయకులు గెంటేలా విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం సరుకులు పంపిణీ చేశారు. కొంతమంది ఆటోడ్రైవర్లు వరదలతో ఆటోలోను కోల్పోవటంతో పలువురు ఆటోడ్రైవర్లకు సరుకులు అందజేశారు.

ఖమ్మంటౌన్: నగరపాలకసంస్థ పరిధిలోని పలు డివిజన్లలోని వరద బాధితులు 270 కుటుంబాలకు బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు సోమవారం రూ.2.30లక్షల విలువైన నిత్యావసరాలను పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అందచేశారు.

గిరిజనులను ఆదుకోవాలి

తిరుమలాయపాలెం: వర్షాలతో సర్వం కోల్పోయిన రాకాసితండావాసులను ప్రభుత్వంతో పాటు దాతలు ఆదుకోవాలని రాష్ట్ర గిడ్డంగుల సర్థు చైర్మన్ రాయల నాగేశ్వరరావు కోరారు. సోమవారం తండాలో పర్యటించి బాధితులతో మాట్లాడారు. దాతలు ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. 75కుటుబాలకు సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంగిలాల్, గుగులోత్‌మోహన్, పోట్ల కిరణ్ పాల్గొన్నారు.

మదీనా పెట్రోల్ బంక్ ఆధ్వర్యంలో..

భారీవర్షాలతో రాకాసితండా పూర్తిగా వరదతో సర్వం కోల్పోయి నిరాశ్రయలైన ప్రజలకు పిండిప్రోలు సమీపంలోని మదీన పెట్రోల్‌బంక్ ఆధ్వర్యంలో 54మందికి నిత్యావసర సరుకులను తహసీల్దార్ వీవీ రామకృష్ణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడవో సిలార్ బంకు యజమాని హుస్సేన్, మేనజర్ ఝాన్సీ, ఎంపీవో సూర్యనారాయణ ఆర్ఐ వీరయ్య పాల్గొన్నారు.





నిత్యావసరాలు అందచేస్తున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల, జలగంనగర్‌లో మాజీ ఎమ్మెల్యే కందాళ, శ్రీధర్, మల్లికార్జున్ ఆధ్వర్యంలో..

వరద ముంచెత్తినా.. సడలని భక్తి




వెంకటేశ్వరనగర్ వరద ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం, రాయగూడెంలో వినాయక పూజలో పాల్గొన్న బోయిన వేణు దంపతులు

ఖమ్మంసాంస్కృతికం,సెప్టెంబరు9: మున్నేరు తమ ప్రాంతాన్ని ముంచెత్తి సర్వం కోల్పోయినా ఏటా నిర్వహించే వినాయక ఉత్సవాన్ని మాత్రం కొనసాగిస్తూ కొందరు భక్తిని చాటుకుంటున్నారు. మున్నేటి ఒడ్డునే ఉన్న వెంకటేశ్వర నగర్ వాసులు ఇటీవల సంభవించిన వరదకు తీవ్రంగా నష్ట పోయారు. వరద ఇళ్లను ముంచేయటంతో కట్టుబట్టలతో మిగిలారు. అయినప్పటికీ వినాయక పందిరిని ఏర్పాటు చేసి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఏటా నిర్వహించే సంప్రదాయాన్ని ఆకస్మికంగా వదిలేయటం మంచిది కాదన్న అభిప్రా యంతో ఉత్సవాన్ని కొనసాగిస్తున్నారు. పద్దెనిమిదేళ్లుగా స్థానికులు వినాయక ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కాగా ఈ ఏడాది వర్షాలు, వరదలు చుట్టుముట్టటంతో తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. అయినప్పటికీ సంప్రదాయాన్ని వదిలేయటం మంచిది కాదన్న ఉద్దేశ్యంతో ఈ ఏడాది కూడా వినాయక పందిరిని ఏర్పాటుచేసి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నగరంలో ఏర్పాటుచేసిన వినాయక మండపాలవద్ద పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వినాయక చవితి పర్వదినం నుంచి మొదలైన గణపతి నవరాత్రుల్లో భాగంగా వినాయక వేదికల వద్ద ప్రత్యేక పూజలు తదితర భక్తి కార్యక్రమాలు ఆచరిస్తున్నారు.

వైభవంగా కొనసాగుతున్న వినాయక పూజలు

నేలకొండపల్లి: మండలవ్యాప్తంగా వినాయక నవరాత్రులు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. దాదాపు అన్ని మండపాల వద్ద ప్రశాంతంగా పూజలు జరుగుతున్నాయి. రాయగూడెంలో సోమవారం నిర్వహించిన వినాయక పూజలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బోయిన వేణు దంపతులు పాల్గొన్నారు.

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి

సత్తుపల్లిరూరల్: గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సత్తుపల్లి తహసీల్దార్ కే.యోగేశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గణేష్ రూట్ మార్గ్‌లో విద్యుత్ వైర్లు, రోడ్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని సిబ్బందిని కోరారు. ప్రార్థన మందిరాల వద్ద గట్టి బందో బస్తు ఏర్పాటు చేయాలని, రోడ్లపై గుంతలు లేకుండా మరమ్మత్తు చేయించాలని, తామరచెరువు, బేతుపల్లి పెద్ద చెరువు వద్ద చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలని అన్నారు. చెరువు కట్టల వద్ద విద్యుత్ లైట్లు, భారీ క్రేన్లు, గజ ఈతగాళ్లతో పాటు బారికేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ మందా రవిబాబు, ఎంపీడీవో నాగేశ్వరావు, పట్టణ సీఐ టీ.కిరణ్, ఐబీ డీఈఈ వెంకటేశ్వరరావు, ఎంపీఓ కే.కృష్ణ, విద్యుత్ ఏఈ శరత్, గిర్దావర్ నరేష్ పాల్గొన్నారు.

డీజేలు పెడితే కఠిన చర్యలు: నేలకొండపల్లి ఎస్ఐ

నేలకొండపల్లి: వినాయక మండపాల వద్ద డీజేలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో డీజేల యజమానులు, ఆపరేటర్లు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఎక్కడైనా డీజేలు పెడితే చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజేల యజమానులు, ఆపరేటర్లు, డ్రైవర్లను ముందస్తుగా బైండోవర్ చేసినట్లు తెలిపారు.

దుకాణాల వేలం వాయిదా

కారేపల్లి, సెప్టెంబరు9: మండల పరిధిలోని ఉసిరికాయపల్లిలో దసర సందర్భంగా ఏర్పాటుచేసే స్టాల్స్ వేలం మరోసారి వాయిదా వేశారు. పదిరోజుల పాటు జరిగే జాతరలో వివిధ రకాలస్టాల్స్ ఏర్పాటు చేసుకుని విక్రయాలు చేసేవారు. ఇటీవల కొన్ని దుకాణలకు వేలం నిర్వహించారు. మిగిన దుకాణాల వేలం పాటలు సోమవారం దేవదాయశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే వేలంపాటలకు ఏవరూ రాకపోవడంతో అధికారులు మరోసారి వాయిదా వేశారు.

ల్యాప్‌టాప్ వితరణ

వైరా, సెప్టెంబరు 9: వైరా లయన్స్‌క్లబ్, గ్రేట్ విజన్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఓ విద్యార్థికి ల్యాప్‌టాప్, మహిళకు కుట్టుమిషన్ సోమవారం వితరణగా అందజేశారు. పేద విద్యార్థులను ఆదుకునేందుకు ఎప్పుడు ముందుంటామన్నారు. కార్యక్రమాల్లో డాక్టర్ కాపా మురళీకృష్ణ, లగడపాటి ప్రభాకర్, తోటకూర శ్రీకాంత్, ఉంద్రు శ్యాంబాబు, ఉంద్రు వరలక్ష్మీ, గంగవరపు కిషన్, జాలా పుల్లారావు, ఉయ్యూరు రామకృష్ణ, జాలా మహాలక్ష్మీ, అనిల్, గోపి, వెంకటేష్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

మధిర, సెప్టెంబరు 9: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికిగాను మాథ్స్, ఇంగ్లీష్, తెలుగు, కామర్స్ సబ్జెక్టుల్లో బోధించుటకు అతిథి అధ్యాపకుల పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు నేడు ఆఖరు తేదీ అని, బుధవారం ఉదయం ఇంటర్వ్యూలు జరుగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు పీజీలో 50శాతం, ఇతరులు 55శాతం మార్కులు వచ్చివుండాలని, బోధన అనుభవం ఉన్నవారికి తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

రైతులను ఆదుకోవాలి

తల్లాడ,సెప్టెంబరు9: వర్షాల వల్ల జిల్లాలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు డిమాండ్ చేశారు. తల్లాడ మండలంలో దెబ్బతిన్న పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఎకరాకు రూ.30వేల మేరకు పత్తి సాగు కోసం రైతులు పెట్టుబడులు పెట్టారని, పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని పేర్కొన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, నాయకులు సంగీతం సాయిచంద్, రాయల రమేష్, ఎల్లంకి సుధాకర్, వేముల వెంకట్రామయ్య పాల్గొన్నారు.

నేడు 'నా ఖమ్మం.. కోసం నేను'

వైరా, సెప్టెంబరు 9: వైరా మునిసిపాలిటీలో మంగళవారం నా ఖమ్మం కోసం నేను అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మునిసిపల్ కమిషనర్ చింతా వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతీఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు మావో

ఖమ్మంసంక్షేమవిభాగం,సెప్టెంబరు 9: ప్రపంచానికి విప్లవ శంఖారావం పూరించిన మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు మావో అని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మావో 48వ వర్ధంతి సభను నిర్వహించారు మావో చిత్రపటటానికి పూలమాల వేసి నివాళులు ఆర్పించారు. నాయకులు ఝాన్సీ, కే.శ్రీనివాస్, మందా సురేశ్ పాల్గొన్నారు.

సేవాలాల్ సేన ఆవిర్భావ దినోత్సవం

ఖమ్మంరూరల్,సెప్టెంబరు9:మండలపరిధిలోని పెద్దతండాలో సేవాలాల్‌సేనా ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు నెహ్రూ సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పృధ్విరాజ్ రాథోడ్, మత్రు నాయక్, భద్రునాయక్, సుశీలబాయి, విజయబాబు, రమేస్, రాజేందర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఐటీఐ అడ్మిషన్లు

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు 9: జిల్లాలోని ప్రభుత్వ ప్రవేటు ఐటీఐల్లో నాలుగో దఫా అడ్మిషన్ల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. మూడు విడతల్లో సీట్లు రాని విద్యార్థులు ఈ నాలుగో దఫాలో ఈ నెల 11నుంచి 20వ తేది వరకు అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు.

చేతిపంపు ప్రారంభం



కల్లూరు, సెప్టెంబరు9: మండలంలోని రఘునాథబంజర గ్రామంలో సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్ ఆధ్వర్యంలో రూ.80వేల అంచనాతో ఏర్పాటు చేసిన మంచినీటి చేతి పంపును ఆసంస్థ అధినేత మైఖేల్ వైజర్, కార్యదర్శి పి.ఏనోష్ కుమార్ సోమవారం ప్రారంభించారు. స్థానికుల అభ్యర్థన మేరకు చేతిపంపు ఏర్పాటుకు నగదును వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు కుక్కా అంజన్‌రావు, ఉప సర్పంచు చల్లగుండ్ల వెంకటేశ్వరరావు, ప్రముఖులు బొక్కా వెంకటేశ్వర రావు, బండి నరిసింహారావు, జానపాటి రామారావు, రాజరత్నం, సుదర్శనం, భాస్కరరావు, విజయరావు, కృపానందం పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయుడి హఠాన్మరణం

ఖమ్మంసంక్షేమవిభాగం/ఖమ్మంటౌన్, సెప్టెంబరు9: సీనియర్ పాత్రికేయుడు అబ్బుగోని సమ్మయ్య(48) సోమవారం గుండేపోటుతో తన నివాసంలో కన్నుమూశారు. రెండు దశాబ్దాలుగా సమ్మయ్య పలు దినపత్రికల్లో పాత్రికేయులుగా పనిచేశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మేయర్ పునకొల్లు నీరజ వెళ్లి భౌతికకాయం వద్ద నివాళులు ఆర్పించారు. కాగా సమ్మయ్య కుటుంబానికి టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ రూ.12వేలు ఆర్థిక సాయం అందచేశారు. భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమ్మయ్య భౌతక కాయాన్ని పలువురు విలేకరులు సందర్శించారు. నివాళులర్పించారు.

తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఖమ్మంరూరల్,సెప్టెంబరు9: మండలంలోని కస్నాతండా, వాల్యాతండా, తనగంపాడు, గూండాలతండా గ్రామాల్లో ఆకేరు వరదలకు తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) ఆధ్వర్యంలో తహసీల్దార్ రాంప్రసాద్‌కి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం, గురవయ్య, రాజేశ్, సీతారాములు, చిన్నగురవయ్యవీరభద్రం పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ముదిగొండ, సెప్టెంబరు 9: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం మాజీ జడ్పీటీసీ బులెట్‌బాబు, ఐఎన్‌టీయూసీ నాయకుడు ఉసికల రమేష్ బాధితులకు అందజేశారు. అంతోటి రాజుకు రూ.17వేలు, నాయిని వెంకటేశ్వర్లుకు రూ.33వేలు, మల్లెల దమయంతికి రూ.17 వేల చొప్పున చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మందరపు ఉపేంద్రరావు, చెన్నారావు, నర్సింహారావు పాల్గొన్నారు.

మధిరటౌన్: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫారసుతో మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పంపిణీ చేశారు. వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన మధిర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పది మందికి రూ.4,47,000 లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో తూమాటి నవీన్ రెడ్డి, చావా వేణు, కర్నాటి రామారావు, అద్దంకి రవి, దారా బాలరాజు, సత్యనారాయణ రెడ్డి, బాలాజి, బాజీ, జహంగీర్, రమణ, యర్రగుంట రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

బోనకల్: మండలంలోని నారాయణపురం, రాయన పేట గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ నాయకులు సూర్యదేవర సుధాకర్, కర్నాటి రామకోటేశ్వరావు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.డిప్యూటీ సీఎం పేరు మీదుగా ఉన్న క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తినేని తిరుపతయ్య, తూము రోషన్ కుమార్, యంగల ఆనందరావు, ఏలూరి పూర్ణచందరరావు, వీరభద్రం పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆర్యవైశ్య సంఘం నాయకుల సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

వైరా, సెప్టెంబరు9: వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌ను ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఇటీవల జరిగిన ఆర్య వైశ్యసంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన మిట్టపల్లి కిరణ్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కిరణ్‌ను ఎమ్మెల్యే అభినందించి సన్మానించారు. ఆతర్వాత ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో సన్మానించారు. వనమా విశ్వేశ్వరరావు, నూకల వాసు, ప్రసాద్, యంద్రపూడి శంకర్, కొల్లా రాంబాబు, వనమా కార్తీక్, మిట్టపల్లి విజయ్, నాగేశ్వరరావు, నూకల అన్నపూర్ణ, వజినేపల్లి చక్రవర్తి పాల్గొన్నారు.

వరద సమస్యలపై నేడు వైరాలో ఎమ్మెల్యే సమీక్ష

వైరా, సెప్టెంబరు 9: పదిరోజులుగా భారీ వర్షాలు, త్రీవ వరదలతో నెలకొన్న సమస్యలపై నియోజకవర్గ స్థాయి అధికారులతో మంగళవారం వైరాలోని తమ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారని వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి తెలిపారు. వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న పంటలు, రోడ్లు, ఇతర సమస్యలపై నియోజకవర్గంలోని అయాశాఖల అధికారులతో సమీక్షిస్తారని వివరించారు.

సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి

ఖమ్మంటౌన్,సెప్టెంబరు9: ఈనెల11నుంచి 17 వరకు జిల్లాలో నిర్వహించే తెలంగాణా సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అమరవీరుల స్థూపాల వద్ద నివాళులు అర్పిస్తామని, 17నఖమ్మంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట అమర వీరుల జిల్లా సభ జరుగుతుందని, జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

పంపిణీకి నోచుకోని దివ్యాంగుల వాహనాలు



ఖమ్మంఖానాపురంహవేలి సెప్టెంబరు9: నగరంలోని రోటరీనగర్ దివ్యాంగ హాస్టల్లో ఉన్న మూడు చక్రాల ట్రైసైకిళ్ళు, వాహనాలు పంపిణీకి ఆలస్యమవుతున్నాయి. ఈ వాహనాలకు నెలల కొద్దీ పక్కన వేయటంతో ఎందుకూ పనికిరాకుండ పోయేందుకు ఆస్కారం ఉంది. దీనిపై జిల్లా సంక్షేమ శాఖ అధికారిని వివరాలు అడుగగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మరో వారం రోజుల్లో అర్హులైన దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేస్తామని జిల్లా మహిళా శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. గతలోక్‌సభ ఎన్నికల సమయంలో వచ్చిన ఈ మూడు చక్రాల వాహనాలను అర్హులకు అందించేందుకు కొంత ఆలస్యం అయింది. మొత్తం 13వాహనాలు అందుబాటులో ఉన్నాయి. అందులో ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలకు చెందిన దివ్యాంగులకు అందించాల్సి ఉంది. 15 రోజుల క్రితం 19 ట్రైసైకిళ్ళు వచ్చాయి. అవి పాలేరు నియోజకవర్గానికి అందిచాల్సి ఉన్నాయి. కలెక్టర్ మంత్రుల సమక్షంలో త్వరలోనే అందిస్తామని చెప్పారు.

ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం





కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కమల్‌రాజు, న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో, సత్తుపల్లి జేవీఆర్ కాళాశాలలో ప్రిన్సిపాల్ గోపి నివాళులర్పిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు8: తెలంగాణ భాషా దినోత్సవాన్ని సోమవారం స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. సెప్టెంబరు9న కాళోజీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలను 2014 నుంచి ఏటా నిర్వహిస్తున్నారు. కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి వాళులర్పించారు. తెలంగాణ యాస భాష ఎన్నో విమర్శలకు లోనైనా భాషపై ఉన్న మమకారంతో ఉద్యమస్ఫూర్తితో తెలంగాణ సాహిత్యానికి ఎనలేని సేవను కాళోజీ చేశారని ప్రిన్సిపాల్ ఎస్.గోపి అన్నారు. కార్యక్రమంలో సీహెచ్.పూర్ణచంద్రరావు, డా.వి. రవిశంకర్, ఎం.రాంబాబు, ఎం.మాధవి,కే.పద్మారాణి, పాల్గొన్నారు.

వైరా:వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్, ఠాగూర్ విద్యాలయాల్లో సోమవారం మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. న్యూలిటిల్‌ఫ్లవర్‌లో కాళోజి నారాయణరావును చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్ నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ షాజీ మాథ్యూవ్, ఏవో నర్సింహారావు పాల్గొన్నారు. ఠాగూర్ విద్యాసంస్థల్లో కాళోజి నారాయణరావు చిత్రపటానికి చైర్మన్ వాసిరెడ్డి సునీత, కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ప్రిన్సిపాల్ కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ పీవో లింగారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మధిరటౌన్:తెలంగాణ భాషా దినోత్సవాన్ని సోమవారం మధిరలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహిం చారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ భాషకు, తెలంగాణ కవులకు గుర్తింపును తీసుకు వచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తారు నాగేశ్వరరావు, అరిగె శ్రీను, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, వంకాయలపాటి నాగేశ్వరరావు, కపిలవాయి జగన్, గుగులోత్ కృష్ణ పాల్గొన్నారు.

ఏన్కూరు: కాళోజీ జీవితం ఆదర్శనీయమని రాష్ట్ర విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్షిమ అన్నారు. మూలపోచారం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కాళోజీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జి.నాగరాజు, ఉపాధ్యాయులు డీఎస్‌నాగేశ్వరావు, బి.శోభన్, శ్యామలమమ, బి.రవి, ఆర్.శ్యాంసుందర్‌రావు రమేష్ చంద్రరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

కారేపల్లి: మండలం కాళోజీరావు జయంతిని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మోకాళ్ళ గుంపు పాఠశాల హెచ్ఎం అజ్మీర వీరు నాయక్, రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ఎల.రాములు అన్నారు.